తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
07-10-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 239
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



# చేప పిల్లలు.. పెరిగేదెలా..? బతికేదెలా?!

## చేప పిల్లల పంపిణీలో లేట్ కలకలం



- ఆగస్టులోనే చెరువుల్లోకి చేరాల్సింది.. అక్టోబర్ వచ్చినా కానరాని మోక్షం
- రాష్ట్రవ్యాప్తంగా నత్తనడకన సాగుతున్న ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ
- వర్షా భావం, చెరువుల్లో నీటి కొరత సాకుతో ఆలస్యమైన పంపిణీ
- ఇరిగేషన్ శాఖ ఇచ్చే 50 శాతం నీటి నిల్వల నివేదికే పంపిణీకి అత్యంత కీలకం
- ప్రతి చెరువు వద్ద పంచాయతీ తీర్మానం తప్పనిసరి నిబంధన
- పంచాయతీ తీర్మానాలు లేకపోతే బిల్లులు రావన్న భయంతో తలపట్టుకుంటున్న కాంట్రాక్టర్లు
- ఆలస్యంగా వదిలితే రానున్న ఎండలకు చనిపోయే ముప్పు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక స్వావలంబన కోసం ఏటా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఈ ఏడాది తీవ్ర జాప్యంతో కలకలం రేపుతోంది. సాధారణంగా వర్షాకాలం ఆరంభమై చెరువులు, కుంటలు నిండిన వెంటనే.. అంటే ఆగస్టు మొదటి లేదా రెండో వారంలోనే చేప పిల్లలను నీటిలోకి విడుదల చేయాల్సి ఉంటుంది. అప్పుడే శీతాకాలం, ఎండాకాలం వచ్చే నాటికి అవి తగిన పరిమాణంలో బరువు పెరిగి మత్స్యకారులకు లాభసాటిగా మారతాయి. అయితే అక్టోబర్ నెల ముగుస్తున్నా రాష్ట్రంలో ఒక్క దగ్గర మాత్రమే తూతూ మంత్రంగా పంపిణీ ప్రక్రియ పూర్తిచేశారు. అంతేకాని ఇంకా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం మత్స్యకార సొసైటీల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**వర్షా భావం చేపపిల్లల పింపిణీలో జాప్యం**

ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడకపోవడం, చాలా జిల్లాల్లో ప్రాజెక్టులు, మధ్యతరహా చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో పంపిణీ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చారు. గ్రౌండ్ లెవల్‌లో పంపిణీకి సాంకేతిక ఆటంకాలు తప్పడం లేదు. ఏ చెరువులో ఎంత మేర నీరుంది?

మిగతా 2వ పేజీలో..

## నేటి నుంచి హైదరాబాద్‌లో సరస్ ఉత్సవ్ 2026

- నెక్లెస్‌రోడ్ ఎచ్ఎండీఏ మైదానంలో హస్తకళల ప్రదర్శన మేళా
- అక్టోబర్ 18 వరకు నిర్వహణ..
- ప్రారంభించనున్న మంత్రి సీతక్క
- పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేత వస్త్రాలతో పాటు దేశవ్యాప్త హస్తకళలు, ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు

2



## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

- టవర్స్‌ను వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

2



## డిమాండ్ పెరిగినా కోతలు లేవు

- జలవిద్యుత్ ఉత్పత్తి 4 వేల మెగావాట్లు తగ్గింది
- మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం పడింది
- గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**పులిచింతల, సిరి న్యూస్, అక్టోబర్ 6**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతోపాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 15 వేల

మిగతా 3వ పేజీలో..



## శంకర్ వైద్య ఖర్చులు నేనే భరిస్తా



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కిమ్స్ లో చికిత్స పొందుతున్న మెదక్ కానిస్టేబుల్ కుటుంబానికి భరోసా

3



## డిపెండెంట్‌లకు ఆర్డర్లు అందజేయాలి

- సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక నిర్ణయాలు
- సింగరేణి ప్రాంత ప్రజా ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం

2



## ట్రూఅప్ పేర ప్రజల నెత్తిన పిడుగు

- రూ.5420 కోట్లు ప్రజలపై భారం
- ఇప్పటికే ఎల్నినో, ధరలపెరుగుదలపై ప్రజల ఇబ్బందులు
- విద్యుత్ కొనుగోళ్లకు, ప్రజలకు ఏంటి సంబంధం?
- ప్రభుత్వ కొనుగోళ్లకు వినియోగదార్లపై భారమా?
- ప్రజా ఉద్యమం చేస్తాం
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్ రావు

3

## పకడ్బందీగా ఎరువుల పంపిణీ



- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఖరీఫ్‌లో విజయవంతమైన డిజిటల్ విధానం
- ఫార్మర్స్ రిజిస్ట్రీలో తెలంగాణ ముందంజ

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 6 :**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల పంపిణీ ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఫెర్టిలైజర్ యాప్‌ల ద్వారా పంపిణీని పర్యవేక్షించడం, ఎరువులను ముందుగానే అందుబాటులో ఉంచడం (అడ్వాన్స్ పొజిషనింగ్) వల్ల రైతులకు ఎరువుల కొరత రాలేదని ఒక ప్రకటనలో

మిగతా 2వ పేజీలో..

## ఎర్రవల్లిలో 'అమరవీరుల కాలనీ'..

- ఎర్రవల్లి, శివారు వెంకటాపురం భూములపై సీఎం సమీక్ష
- సర్వే నెం.325పై కేసీఆర్‌కు జారీ కానున్న నోటీసులు

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 6 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమికి గాను రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి

మిగతా 2వ పేజీలో..



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- 67 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ అనంతరం ఊరట
- రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం
- ప్రతి ఆదివారం పోలీసుల ముందు హాజరుకావాలని కోర్టు షరతు

2

# నేటి నుంచి హైదరాబాద్‌లో సరస్ ఉత్సవ్ 2026

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 6 (సిరి న్యూస్):**



హైదరాబాద్ నగర వేదికగా దేశవ్యాప్త హస్తకళలు, చేనేత ఉత్పత్తుల అద్భుత సంగమంగా భావించే జాతీయ స్థాయి మేళా సరస్ ఉత్సవ్ 2026 నేటి నుండి అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. తెలంగాణ ప్రభుత్వ పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని ఎచ్ఎండీఏ మైదానంలో ఈ ప్రదర్శనను రాష్ట్ర పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. నేటి నుండి 18 వరకు దాదాపు 12 రోజుల పాటు ఈ మేళా ప్రజలకు కనువిందు చేయనుంది. ఈ జాతీయ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు ప్రత్యేక స్టాల్స్ కేటాయించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వృత్తులు, కళలకు చెందిన ఉత్పాదకులు పెద్ద సంఖ్యలో స్టాల్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

**స్టాల్స్ విశేషాలు..**

చేనేత మరియు హస్తకళలు.. తెలంగాణకు ప్రత్యేక గుర్తింపునిచ్చే పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేత చీరలతో పాటు కలంకారి ప్రింట్లు, ఎంబ్రాయిడరీ వర్కులు, ప్రత్యేక చెక్క బొమ్మలు, జూట్ బ్యాగులు, లెదర్ బ్యాగులు, మట్టి పాత్రలు, బంజారా సాంప్రదాయ కళాకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. ప్రత్యేక రుచులు.. పిండివంటలు.. తెలంగాణ ప్రత్యేక పిండి వంటలు, నోరూరించే ఊరగాయ పచ్చళ్లు, వివిధ రకాల ఆరోగ్యకరమైన పొడులు, మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రత్యేక రుచులు అందుబాటులో ఉండేలా పంచాయత్ రాజ్ శాఖ ప్రత్యేకంగా అవకాశం కల్పించింది. అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు సరస్ ఉత్సవ్‌కు విచ్చేసే నగర ప్రజలకు కేవలం కొనుగోళ్లే కాకుండా, పూర్తి వినోదాన్ని అందించేలా పంచాయత్ రాజ్ శాఖ భారీ సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించింది. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బతుకమ్మ పాటలు, కోలాటాలు, జానపద నృత్యాలు మరియు ప్రత్యేక సంగీత వేడుకలు ప్రతిరోజూ ప్రేక్షకులను అలరించనున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులు తమ సంప్రదాయ చేతివృత్తుల నైపుణ్యాలను, కళలను ప్రదర్శించేందుకు ఈ వేదిక వేదికై నిలవనుంది. గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు, చేనేత మరియు హస్తకళల కళాకారుల అద్భుత నైపుణ్యానికి ఈ మేళా ద్వారా జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు రానుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ ప్రజలందరూ ఈ ప్రదర్శనను తిలకించి, గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.



# పకడ్బందీగా ఎరువుల పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్‌ల ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా 33.39 లక్షల మంది రైతులకు 128.18 లక్షల యూరియా బస్తాలను పంపిణీ చేయగా, కేంద్ర ప్రభుత్వ ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా 37.48 లక్షల మందికి 104.99 లక్షల అన్ని రకాల ఎరువుల బస్తాలను అందించినట్లు వివరించారు. ఈ డిజిటల్ విధానంతో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలకు అడ్డుకట్ట పడిందని, ఫలితంగా గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి 35 వేల టన్నుల యూరియా వాడకం తగ్గిందని పేర్కొన్నారు.

**భారీగా ఎరువుల నిల్వలు**

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో యూరియా నిల్వలు గణనీయంగా పెరిగాయని మంత్రి తుమ్మల వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో కేవలం 0.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉండగా, ప్రస్తుతం 2.33 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. అలాగే డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు కూడా రైతులకు సరిపడా ఉన్నాయని తెలిపారు. విదేశాల నుంచి వచ్చే ఎరువుల షిప్‌మెంట్లు ఆలస్యం కాకుండా షిప్‌యార్డుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకున్నామని వివరించారు.

**డిజిటల్ క్రాప్ బుకింగ్.. భవిష్యత్ పథకాలకు ఆధారం**

రైతుల సమగ్ర సమాచారంతో కూడిన 'ఫార్మర్స్ రిజిస్ట్రీ' రూపకల్పనలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 202627 వానాకాలానికి గాను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ఇప్పటికే 75.9 శాతం (1.46 కోట్ల వ్యవసాయ క్షేత్రాలు) పూర్తయిందన్నారు. భవిష్యత్తులో పంటల కొనుగోళ్లు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ తదితర ప్రభుత్వ పథకాలన్నింటికీ ఈ డిజిటల్ క్రాప్ బుకింగ్ వివరాలే ప్రాతిపదికగా ఉంటాయని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఎర్రవల్లిలో 'అమరవీరుల కాలనీ'..

**మొదటిపేజీ తరువాయి**

వివరించగా మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో అధికారులు సర్వే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు అందజేయాలని అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్నది. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలకు కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ డిపార్టుమెంటుకు అప్పగించాలని సూచించారు. జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



# చేప పిల్లలు.. పెరిగేదెలా..? బతికేదెలా?!

**మొదటిపేజీ తరువాయి**



చేపల పెరుగుదలకు ఆ నీరు సరిపోతుందా? అన్న వివరాలు సేకరించడంలోనే రోజులు గడిచిపోతున్నాయి. ఇరిగేషన్ శాఖ నుంచి అధికారిక నివేదికలు వస్తే తప్ప చేప పిల్లలను విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలో యంత్రాంగం కొట్టుమిట్టాడుతోంది.

**50 శాతం నీరుంటేనే అనుమతి!**

క్షేత్రస్థాయి నిబంధనల ప్రకారం కనీసం 33 నుంచి 50 శాతం నీటి నిల్వ ఉన్న జలాశయాలు, చెరువుల్లో మాత్రమే చేప పిల్లలను వదలాల్సి ఉంటుంది. ఇరిగేషన్ అధికారులు క్షేత్ర పరిశీలన జరిపి ఇచ్చే నివేదిక ఆధారంగానే మత్స్యశాఖ అధికారులు ఆయా చెరువులను పంపిణీ జాబితాలో చేరుస్తున్నారు. అయితే పలు జిల్లాల్లో ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నీటి మట్టాల గుర్తింపు, ఆమోదాల ప్రక్రియ ఆలస్యమయ్యే కొద్దీ సీజన్ ముగిసిపోతోందని మత్స్యకారులు వాపోతున్నారు.

**ప్రతి చెరువుకూ పంచాయతీ తీర్మానం**

పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలను తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. గతంలో కేవలం మత్స్యశాఖ అధికారులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధుల సమక్షంలో చేప పిల్లలను వదిలి వీడియో రికార్డింగ్ చేసేవారు. కానీ ఈసారి పారదర్శకత పేరిట ప్రతి చెరువు వద్ద గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమక్షంలోనే పంపిణీ జరగాలని, గ్రామ పంచాయతీ తీర్మానం పత్రం జతచేయాలని షరతులు పెట్టినట్లు సమాచారం. అయితే స్థానిక సంస్థల సమన్వయం, గ్రామగ్రామాన తిరిగి తీర్మానాలు తీసుకోవడం కాంట్రాక్టర్లకు పెనుభారంగా మారింది. పంచాయతీ తీర్మానాలు సకాలంలో అందకపోతే నిధుల బిల్లులు ఆగిపోతాయన్న భయంతో సరఫరాదారులు సైతం ముందుకు రాలేకపోతున్నారు.

**కాలం మించితే చేప పిల్లలు బతికేనా?**

ఇప్పుడు అక్టోబర్‌లో చేప పిల్లలను వదిలితే అవి పూర్తిస్థాయిలో పెరిగేందుకు తగినంత కాలం దొరకదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న నవంబర్, డిసెంబర్ నాటికి చలి తీవ్రత పెరిగి చేపల పెరుగుదల మందగిస్తుంది. ఇక ఫిబ్రవరి, మార్చి నాటికి ఎండల తీవ్రత పెరిగి గ్రామీణ చెరువుల్లో నీరు అడుగంటిపోతుంది. నీటి లభ్యతను శాస్త్రీయంగా పరిశీలించకుండా కేవలం కాగితాల్లో లక్ష్యాలను పూర్తి చేశామని చెప్పుకోవడానికి అరకొర నీరున్న చెరువుల్లో సీడ్ వదిలితే వేలాది చేప పిల్లలు ఊపిరాడక చనిపోయి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఇప్పటికైనా మత్స్యశాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి వాస్తవాలపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలి. జిల్లాల వారీగా ఎంపిక చేసిన చెరువుల సంఖ్య, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఇప్పటివరకు విడుదల చేసిన చేప పిల్లల వివరాలను శ్వేతపత్రం ద్వారా బహిర్గతం చేయాలి. కాలయాపన చేయకుండా యుద్ధప్రాతిపదికన పంపిణీ ముగించి మత్స్యకారుల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

**మళ్లీ మొదటి నుంచి కసరత్తు చేయాల్సి వస్తోంది..**

పూర్ణిమ, ఇన్ చార్జ్ డీఎఫ్ఓ, సంగారెడ్డి జిల్లా

గతంలో నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం చెరువుల్లో కనీసం 33 శాతం నీటి నిల్వ ఉంటే చేప పిల్లలను వదిలేందుకు వాటర్ బాడీస్‌ను గుర్తించి ప్రాథమిక జాబితాను సిద్ధం చేశాం.. అయితే ప్రస్తుతం ప్రభుత్వం, హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన తాజా మార్గదర్శకాల ప్రకారం నీటి నిల్వ ప్రమాణాన్ని 33 శాతం నుంచి ఏకంగా 50 శాతానికి పెంచారు.. సగానికి పైగా నీటి నిల్వ ఉన్న చెరువులకే ప్రాధాన్యతనిచ్చి చేప పిల్లలను విడుదల చేయాలన్న నిబంధన రావడంతో, పాత జాబితా మొత్తాన్ని పక్కనపెట్టి మళ్లీ మొదటి నుంచి కసరత్తు చేయాల్సి వస్తోంది.. ఈ క్రమంలో ఏయే చెరువుల్లో ఎంత శాతం నీటి లభ్యత ఉందనే కచ్చితమైన క్షేత్రస్థాయి గణాంకాలను ఇరిగేషన్ శాఖ నుంచి తెప్పించుకుని మత్స్యశాఖ ద్వారా పునఃపరిశీలిస్తున్నాం.. నీటి పరిమాణం, చెరువుల ఎంపికపై ఉన్న సాంకేతిక సందేహాలు నివృత్తి అయ్యాక, హెడ్ ఆఫీస్ నుంచి పూర్తిస్థాయి స్పష్టమైన ఆదేశాలు, అనుమతులు వచ్చిన వెంటనే అధికారిక షెడ్యూల్‌ను ఖరారు చేసి జిల్లావ్యాప్తంగా అర్హత ఉన్న అన్ని చెరువుల్లో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని పారదర్శకంగా ప్రారంభిస్తాం.

# డిపెండెంట్‌లకు ఆర్డర్లు అందజేయాలి

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6 :**

సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకట స్వామి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, డాక్టర్ మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, గండ్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్ సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ప్రజాభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలను, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వాటన్నింటినీ సానుకూలంగా విని తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుండి 300 వరకు ఉన్న డిపెండెంట్ ఆర్డర్లను, ఇతర లీగల్ ప్రాసెస్‌లను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు అందజేయాలని ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి సుమారు 136 మంది (గరిష్ఠంగా 170 మంది) సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి ఇందుకు ఏర్పాటు చేసిన సింగరేణి ఆఫీసర్స్ కమిటీ సిఫారసుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు రావాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో ప్రతి నెలా ఒక నిర్ణీత బోర్డు మీటింగ్ నిర్వహించాలన్నారు. అక్కడే వీలైనంతమందికి పరీక్షలు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరుకాక ఉద్యోగాల నుండి తొలగింపునకు గురైన కార్మికుల విషయంలో వన్ టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించకుండా సమ్మెకు పిలుపునిచ్చిన లేదా సమ్మెలో పాల్గొన్న అధికారులపై, దానికి నాయకత్వం వహించిన వారిపై 'నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస' కింద ఒక చిన్న హెచ్చరిక జారీ చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు సింగరేణి సంస్థ అప్పగించగా అందులో 4,500 ఎకరాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, మిగతా 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- **67 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ అనంతరం ఊరట**
- **రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం**
- **ప్రతి ఆదివారం పోలీసుల ముందు హాజరుకావాలని కోర్టు షరతు**
- **జూలై 29న నల్గొండలో అరెస్ట్.. చంచల్‌గూడ జైలులో రిమాండ్**

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6:**

లైంగిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణలతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దాదాపు 67 రోజుల అనంతరం మంగళవారం ఆయనకు ఊరట లభించింది. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరిస్తూ ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ముందు హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశించారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూలై 29న నల్గొండ జిల్లా దామరచర్ల వద్ద ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయనకు తాజాగా బెయిల్ లభించింది.



# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6 :**

క్యూర్ పరిధిలో తొలి విడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని, అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పలువురు లబ్దిదారులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్‌ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం ఏడు వేలకు పైగా దరఖాస్తులు అందగా పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని, వారిలో లబ్దిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి 480 మందిని తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితోపాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్దిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాక కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదలు ధనవంతులవుతారు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గాజుల రామారంలో 480 ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన అనంతరం ఆయన ప్రసంగించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్(క్యూర్) పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎంత వ్యయమైనా భరించాలని నిర్ణయించారన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం తర్వాత వాటి ధరలు రూ.50 లక్షల పైనే పలుకుతాయని, ఇది పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. కొత్తగా నిర్మించే టవర్స్ సముదాయంలో ఆలయాలు, మసీదులు, చర్చి వంటి ప్రార్థనా మందిరాలను నిర్మించుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయింపును పరిశీలించాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. క్యూర్ పరిధిలోని కాలుష్య పరిశ్రమలను వెలుపలికి తరలించి స్వచ్ఛమైన గాలి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీలను ఒకటొకటిగా అమలు చేస్తున్నామని, అందులో ఇందిరమ్మ ఇళ్లు అత్యంత ప్రాధాన్యత కలిగిన పథకమని వెల్లడించారు.

# ట్రూ-అప్ పేర ప్రజల నెత్తిన పిడుగు

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 6:**

దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం, విద్యుత్ బిల్లులు పెంచి నెత్తిన పిడుగు వేసింది. ట్రూఅప్ పేరుతో ప్రజల నడ్డి విరిచేందుకు సిద్దమైందని మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.5,420 కోట్లు ప్రజల ముక్కు పిండి వసూలు చేయాలనే ఒక దుర్మార్గమైన నిర్ణయం తీసుకున్నరు. ఒక దిక్కు ఎల్ నినో, మరోవైపు ధరల పెరుగుదల ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ప్రజల తరుపున నేను రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా రూ.5,420 కోట్ల విద్యుత్ బిల్లులను వినియోగదారులపై మోపే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన సొమ్మును వినియోగదారుల నుంచే వసూలు చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసం? బాధ్యత నుంచి తప్పించుకున్న ప్రభుత్వం ప్రజలపై భారం వేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే కరెంట్ కోతలతో అల్లాడుతున్న ప్రజలకు..ఇప్పుడు కరెంట్ బిల్లులు పెంచి వాతలు పెడతారా అని ప్రశ్నించారు. ప్రజలపై భారం మోపే కాంగ్రెస్ సర్కారు తుగ్లక్ నిర్ణయాన్ని బిఆర్ఎస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలపై 5వేల కోట్ల భారం మోపాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఈరోజు రాష్ట్రంలో ఒక తుగ్లక్ పాలన నడుస్తున్నది. స్వయంగా ముఖ్యమంత్రి పాలన చేతగాక చేతులెత్తేసిన పరిస్థితి. పరిపాలనపై ధ్యాస లేదు అనడానికి సంక్షోభంలో కూరుకుపోతున్న విద్యుత్ రంగమే నిదర్శనం. తప్పు చేసింది కాంగ్రెస్.. విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టింది కాంగ్రెస్.. కానీ భారం మాత్రం ప్రజలపై వేస్తున్నరు. కరెంట్ సరఫరా చేయలేని చేతగాని సర్కారు.. బిల్లులు పెంచి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నది. నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యంతో విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి.. ఇప్పుడు ఆ భారాన్ని ప్రజలపైకి నెడుతారా? ఇదేం పాలన రేవంత్ రెడ్డి? మీరు చేసిన తప్పుకు వినియోగదారులు బలి కావాలా? 5వేల కోట్లు అంటే మాటలా? రెండు నెలల్లో వినియోగదారుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమన్నారు. పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలు ఎన్నడూ తీసుకోలేదు. 201617 నుంచి 202122 వరకు ట్రూఅప్ చార్జీలు రూ.12,718.40 కోట్లు వేయాలని ఇఆర్సీ చెప్పినా ఈ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు కేసీఆర్ గారు అనుమతించలేదు. విద్యుత్ సంస్థల భారాన్ని ప్రజలపై వేయొద్దు అని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. కానీ ఈ రోజు రేవంత్ రెడ్డి కరువు పరిస్థితుల్లో ప్రజలపై 5200 కోట్ల భారం వేస్తున్నడు. ఇది ప్రజాపాలన కాదు, ప్రజా పీడన. ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలతో రైతులు పడ్డ నరకయాతనను కండ్ల నిండా చూసిన కేసీఆర్ గారు, అధికారంలోకి రాగానే విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసారని గుర్తుచేశారు.

విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి 91,000 కోట్లతో జెన్కో, ట్రాన్స్కో అభివృద్ధి సహా మౌలిక వసతులను బలోపేతం చేశారన్నారు. మొత్తంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెంచారన్నారు. అనతి కాలంలోనే రాష్ట్రాన్ని 'పవర్' ఫుల్ తెలంగాణగా నిలబెట్టిండు. అన్ని రంగాలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే స్థాయికి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేసిండు. కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్లాంట్లను 42 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించాం. భద్రాద్రి 1080 మెగావాట్లతో నిర్మించాం. 4000 మెగావాట్లతో ఆల్ట్రా థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. భూపాలపల్లిలో 600 మెగావాట్లను ఉత్పత్తి అందుబాటులోకి తెచ్చినం. ఒక్క థర్మల్ లోనే 6480 మెగావాట్లు యాడ్ చేసినం. సోలార్ పవర్ 3600 మెగావాట్లు యాడ్ చేసినం. విద్యుత్ వ్యవస్థను ఎంతో బలోపేతం చేసినం. సింగరేణి మరో 800 మెగావాట్ల విషయంలో రాజస్థాన్ తో జేవీ చేసుకున్నరు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన కొత్త పని ఒక్కటీ లేదు. కొత్తగా ఒక్క సబ్ స్టేషన్ కట్టింది లేదు..కొత్తగా ఒక్క మెగావాటు ఉత్పత్తి సామర్థ్యం పెంచింది లేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏమైంది.

కరెంట్ కే కరోనా పట్టినట్లు అయ్యింది. కరోనా కంటే, ఎల్ ని నో కంటే కాంగ్రెస్ డేంజర్ అని మేము నోటి మాటగా చెప్పడం లేదు

అవకాశం ఉండి నీళ్లు ఇవ్వడం లేదు, అవకాశం ఉండి కరెంట్ ఉత్పత్తి చేయడం లేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫుల్ గా ఉన్న కరెంట్ ఇప్పుడు ఎందుకు నిల్ అయ్యింది. కేసీఆర్ ఉన్నపుడు 24 గంటల కరెంట్ వస్తే, ఇప్పుడు ఎందుకు 6 గంటలు కూడా కరెంట్ రాని పరిస్థితి వచ్చింది. అన్నింటికి ఒకే మంత్రం అన్నట్లు.. మీ పాలన వైఫల్యాన్ని, చేతగాని తనానికి ఎల్ ని నో పేరు చెప్పి, కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటారా? ఎల్ నినోకు బొగ్గు ఉత్పత్తికి కారణం ఏమిటి? దేవాదులలో 24 గంటల మోటార్లు నడపండి అంటే 8 గంటలే నడుపుతున్నరు. దీని వల్ల వరంగల్ జిల్లాకు కరవు వచ్చింది. ఎల్ ని నో కరువు కాదు, కాంగ్రెస్ కరువు. కల్వకుర్తి ప్రాజెక్టును కేసీఆర్ గారు పూర్తి చేస్తే, నీళ్లు ఎత్తు అంటే 8 గంటలే కల్వకుర్తి మోటార్లు నడుపుతున్నరు. నీళ్లు ఇచ్చే ఉద్దేశ్యం లేదు. కన్నెపల్లి దగ్గర కట్క ఒత్తితే నీళ్లు వస్తయి ఎత్తుమంటే, ఎన్డీఎస్ఏ కారణం చెప్పారు. కానీ ఆ ఎన్డీఎస్ఏనే చెంప ఛళ్లుమనేలా సమాధానం చెప్పింది. భద్రాద్రి, యాదాద్రి, సింగరేణి థర్మల్, కేటీపీఎస్ విద్యుత్ కేంద్రాలు నిర్మిస్తే, వాటిని నడిపే తెలివి కూడా ఈ ప్రభుత్వానికి లేదు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో మూడో యూనిట్ ఉత్పత్తి ఎందుకు నిలిచిపోయింది. యాదాద్రి పవర్ ప్లాంట్ సామర్థ్యం 4వేల మెగావాట్లు అయితే 400 కూడా ఉత్పత్తి చేయడం లేదు. సింగరేణి బొగ్గు సంస్థ ఉండి కూడా సింగరేణి థర్మల్ ప్లాంట్ కు బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి. నదుల్లో నీళ్లు ఉన్నా రిజర్వాయర్లు నింపలేదు, నీళ్లు లిఫ్ట్ చేయలేదు. బొగ్గు ఉన్నా సరఫరా చేయరు, కరెంట్ ఉత్పత్తి చేయరు. రూ. 1600 కోట్లు విలువ చేసే 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయం అయ్యాయని, అదో పెద్ద కుంభకోణం అని మేం ముందు నుంచి హెచ్చరించాం. లేని నిల్వలు ఉన్నట్లు చూపి టాక్స్, కోల్ సెస్, సీఎస్ఆర్ చెల్లింపులు చేసి మోసం చేసారని సింగరేణి వ్యాప్తంగా తిరిగి పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చినం. ఇప్పుడు ఏం అయ్యింది. బొగ్గు నిల్వలు లేవు అన్న విషయం తేటతెల్లం అయ్యింది. అప్పుడు బొగ్గు కుప్పల మీద సేల్ బొగ్గు వేసి కవర్ చేసే ప్రయత్నం చేసారు. మరి ఇప్పుడు ఎల్ ని నో వల్లే కరెంట్ ఉండటం లేదని కారణం చెబుతున్నారు.

**పాలన తక్కువ, ప్రతిపక్షాల మీద బురద జల్లడం ఎక్కువ. రైతులకు అనేక ఇబ్బందులు ఉన్నా పట్టించుకోవడం లేదు.**

మీ నిర్లక్ష్యం, మీరు చేసిన పాప ఫలితం ఈరోజు రాష్ట్రంలో కరెంట్ సంక్షోభం. ఉచిత కరెంట్ పేటెంట్ కాదు, పేషెంట్ అయ్యింది. చేతికి వచ్చే పంటను కాపాడుకుందాం అంటే కరెంట్ లేదు, నీళ్లు లేవు. కడుపు మండిన రైతులు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తున్నరు. గ్రామీణ ప్రాంత రైతులు కరెంట్ కోసం పోరాటాలు చేస్తున్నరు. నీ కొండారెడ్డి పల్లిలోనే రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తుంటే నీకు కనిపించడం లేదా రేవంత్ రెడ్డి. కరెంట్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. క్రాప్ హాలిడే, పవర్ హాలిడేలను ఉమ్మడి పాలనలో చూసినం. మీ పాలనలో మల్లా క్రాప్ హాలిడే, పవర్ హాలిడేలు తెస్తున్నవు. ఆనాటి రోజులు తెస్తాం అన్న రేవంత్ రెడ్డి, నిజంగానే ఆనాటి కరెంట్ కోతల రోజులు తెచ్చిండు. నాడు కోతలు పెడితే, కరెంట్ ధరలు పెంచితే నాడు తెలుగు దేశంకు ప్రజలు షాక్ ఇచ్చారు. నేడు నువ్వు ధరల నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే షాక్ తప్పదు అని హెచ్చరిస్తున్నాం. కేసీఆర్ ప్రతి రోజు 140 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే, అందులో 100-110 యూనిట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదు? బొగ్గు లేక, నీళ్లు లేక సరైన నిర్వహణ లేక యాదాద్రి జనరేషన్ కెపాసిటీ 96 మిలియన్ యూనిట్లు అయితే, 39 మిలియన్ యూనిట్లు కూడా దాటడం లేదు? ఉన్న కెపాసిటీని వినియోగించే తెలివి లేదు, బయట నుంచి రూ.10, 12లకు యూనిట్ కొని ప్రజలపై భారం వేస్తారా? అడ్డగోలుగా విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపుతారా? రాష్ట్రంలో మొత్తం థర్మల్ విద్యుత్ ఇన్స్టాల్డ్ కెపాసిటీ 13,384 మెగావాట్లు అయితే, 8000 మెగావాట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదు? ఇది నిర్వహణ లోపం కాకుంటే ఏమిటి రేవంత్ రెడ్డి? నైనీలో మంచి బొగ్గు అందుబాటులో ఉన్నా.. అది కాదని విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకుంటరట లేని బొగ్గు 40లక్షల టన్నులు ఉన్నట్లు చెప్పారు. అది కుంభకోణం అని బయటపెట్టి కిషన్ రెడ్డికి లేఖ రాస్తే చర్యలు తీసుకోలేదు. ఇది చాలదన్నట్లు ట్రాన్స్ కోను ప్రైవేటుపరం చేసే నిర్ణయం తీసుకున్నరు. వేల కోట్ల ఆస్తులున్న రాష్ట్ర విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌ను అమ్మేందుకు సిద్ధమైంది. 26శాతం వాటాల విక్రయానికి నిర్ణయించుకున్నరు. టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు చేస్తున్నది. రాహుల్ గాంధీనేమో పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దు అని అంటడు, సిడబ్లుసీ లో తీర్మానాలు చేస్తరు. కానీ ఇక్కడేమో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తరట. కేసీఆర్ థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటు వాళ్లు పెడతం అంటే ఒప్పుకోలేదు. యాదాద్రి, భద్రాద్రి, సింగరేణి ప్లాంట్లు పెట్టి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేసారు. ఇప్పటికే యాదాద్రిలో యాష్, కోల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ పూర్తి చేసారు. విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాలపై పోరాటం చేయాలని కోరుతున్నాం., వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ విధానాలపై మీది ఒకటే మాట అయితే ఇక్కడి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతున్నాం. ఇవన్నీ చాలదన్నట్లు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరిట ఏకంగా 5,420 కోట్లు ప్రజల పై వేస్తారా? బొగ్గు నిల్వలు చేసుకోవడంలో కాంగ్రెస్ ఫెయిల్. రిజర్వాయర్లు నింపి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ఫెయిల్. హైడల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ఫెయిల్. మరి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలి? ఎవరు ఆదేశిస్తే ఈ నిర్ణయాలు అమలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి ?సరిగ్గా 16 ఏండ్ల క్రితం చంద్రబాబు అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచినందుకు, బషీర్ బాగ్ కాల్పుల దాకా వెళ్లింది. ఈరోజు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపి ఏం చేయదల్చుకున్నావు. ఆనాడు విద్యుత్ బిల్లులపై పోరాటం చేసిన కమ్యూనిస్టులు, నేడు రేవంత్ రెడ్డి చేసే పాపంలో పాల్పంచుకోకండి. ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ చేసే పోరాటంలో పాల్పంచుకోవాలని, కలిసి రావాలని కోరుతున్నాం. ట్రూఅప్ పేరుతో ప్రజలపై మోపే విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని, రూ.5,420 కోట్ల ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే మరో ప్రజా పోరాటానికి బిఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

# డిమాండ్ పెరిగినా కోతలు లేవు

**మొదటిపేజీ తరువాయి**

మెగావాట్లు ఉండగా ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు నాలుగు వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా ఎనిమిది వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల యంత్రాలు, యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసే స్థితిలోనే ఉన్నాయని చెప్పారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనకంటే పెద్దదైన కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని తెలిపారు. ఏపీలో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందన్నారు.

**నీటి వినియోగంలో జాగ్రత్త అవసరం**

రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్తు కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

**27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా వీటిని అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. మునగాలలో విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డిలకు కాంగ్రెస్ శ్రేణులు, అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన వరకు దాదాపు నాలుగు కిలోమీటర్లు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రూ.9.6 కోట్లతో నిరించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు భట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు.

# హైపర్ లోకల్ యాడ్స్‌పై కొత్త నిబంధనలు

- **యాడ్‌పై క్యూఆర్ కోడ్, ప్రింటర్ ఐడీ తప్పనిసరి**
- **చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విగ్రహాలు, వారసత్వ కట్టడాలపై నిషేధం**
- **అక్రమ ప్రకటనల తొలగింపు.. చలాన్‌తో పాటు ఖర్చుల వసూలు**
- **పదేపదే నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలు, వ్యక్తులపై బ్లాక్‌లిస్ట్ వేటు**

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 6:**

తెలంగాణలో CURE పరిధిలో తాత్కాలిక, హైపర్ లోకల్ ప్రకటనల ఏర్పాటుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రకటనల ఏర్పాటు, స్లాట్ బుకింగ్, ధ్రువీకరణ, నిబంధనల అమలుకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రతి వార్డుకు ఒక నోడల్ అధికారిని నియమించనున్నారు. తాత్కాలికంగా 5 నుంచి 10 హైపర్ లోకల్ ప్రకటనలకు వీలుగా 25 నుంచి 50 స్థలాలను గుర్తిస్తారు. సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఈ స్థలాలను పరిశీలించి ఆమోదిస్తారు.

**స్లాట్ బుకింగ్‌కు కొత్త విధానం**

MyCURE లేదా అడ్వర్టైజింగ్ యాప్ ద్వారా కనీసం 7 రోజుల ముందే ప్రకటన స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. ఒక మొబైల్ నంబర్‌తో ఒకేసారి ఒక స్లాట్ మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. బుక్ చేసిన ప్రతి ప్రకటన కుడి దిగువ భాగంలో క్యూఆర్ కోడ్, ఎడమ దిగువన ప్రింటర్ ఐడీ తప్పనిసరిగా ముద్రించాలి. నోడల్ అధికారి వాటిని స్కాన్ చేసి ధ్రువీకరించిన అనంతరం వివరాలను సంబంధిత పోలీసులకు పంపుతారు.

**నిషేధిత ప్రాంతాల్లో ప్రకటనలకు నో**

చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విగ్రహాలు, వారసత్వ కట్టడాలపై ప్రకటనలు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. ట్రాఫిక్, పాదచారుల రాకపోకలు, ట్రాఫిక్ సిగ్నల్‌స్‌కు ఎలాంటి ఆటంకం కలిగించకూడదు. సీసీటీవీ కెమెరాల పనితీరుకు కూడా ప్రకటనల వల్ల అంతరాయం ఏర్పడకూడదని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అనుమతి లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రకటనలను మున్సిపల్, పోలీసు, హైడ్రా అధికారులు వెంటనే తొలగిస్తారు. ఉల్లంఘనలకు చలాన్ విధించడంతో పాటు ప్రకటన తొలగింపునకు అయిన ఖర్చును కూడా దరఖాస్తుదారుడి నుంచే వసూలు చేస్తారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే ఏజెన్సీలు, వ్యక్తులను బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం కూడా మార్గదర్శకాల్లో కల్పించారు.

# శంకర్ వైద్య ఖర్చులు నేనే భరిస్తా

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6:**

విధి నిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్ కు గురై కిమ్స్ సికింద్రాబాద్లో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. శంకర్ వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు కేటీఆర్ తెలిపారు. ఈ విషయాన్ని శంకర్ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరారు. శంకర్ ఆరోగ్య పరిస్థితి, ఆయన కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న కేటీఆర్ మానవతా దృక్పథంతో స్పందించారు. 'శంకర్ వైద్య ఖర్చులను నేను వ్యక్తిగతంగా చూసుకుంటాను'. ఆయన తిరిగి సాధారణ స్థితికి వచ్చే వరకు మనం కుటుంబానికి అండగా ఉన్నామని వారికి తెలియజేయండి' అని ప్రవీణ్ కుమార్ కు చెప్పారు.

శంకర్ కుటుంబ సభ్యులు ఇప్పటికే వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంధువులు, స్నేహితులు, సహచర పోలీసులు కలిసి ఇప్పటివరకు సుమారు రూ.1.5 లక్షలు సమకూర్చి ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న శంకర్కు మరోసారి భారీగా వైద్య ఖర్చులు అవసరం కావడంతో సహచర పోలీసులు ఒక్కొక్కరు తమకు తోచినంత సాయం చేస్తున్నారు. శంకర్ దయనీయ పరిస్థితిని చూసి బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్ విధి నిర్వహణలోనే తీవ్ర అనారోగ్యానికి గురైనా, అత్యవసర సమయంలో ఈహెచ్ఎస్ ద్వారా తక్షణ వైద్య సహాయం అందకపోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2013 నుంచి హోంగార్డుగా పనిచేసిన శంకర్ 2024 తర్వాత కానిస్టేబుల్ గా మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విధి నిర్వహణలో ఉండగానే అకస్మాత్తుగా కుప్పకూలారు. బ్రెయిన్ స్ట్రోక్ గా నిర్ధారణ కావడంతో మొదట వెల్నెస్ ఆసుపత్రికి, అనంతరం నిమ్స్ కు తరలించారు. బెడ్లు అందుబాటులో లేకపోవడంతో యశోదకు తీసుకెళ్లగా ఈహెచ్ఎస్ పై సమస్య తలెత్తిందని కుటుంబ సభ్యులు తెలిపారు. చివరకు కిమ్స్ సికింద్రాబాద్ లో చికిత్స ప్రారంభించారు.

**కేటీఆర్ స్పందించే వరకు ఎందుకు పట్టించుకోలేదు?**

శంకర్ కుటుంబం ఇంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఈహెచ్ఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు తగిన విధంగా స్పందించలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ తరఫున ఈ అంశాన్ని ప్రశ్నించిన తర్వాతే ఈహెచ్ఎస్ అధికారులు స్పందించి పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులు, ఉద్యోగులు, పెన్షనర్లకు అత్యవసర వైద్యంలో భరోసా కల్పించాల్సిన ఈహెచ్ఎస్ వ్యవస్థలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# కంటి ఆపరేషన్‌పై నివేదిక పంపండి

- **జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిని నివేదిక కోరిన టీజీహెచ్ఆర్సీ**

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6,**

సిరిసిల్లకు చెందిన కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి బదులుగా కుడి కంటికి శస్త్రచికిత్స చేసినట్లు వచ్చిన వార్తా కథనాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ ఆరోపణలు నిజమైతే వైద్య నిర్లక్ష్యం, రోగి భద్రత, శస్త్రచికిత్సకు సంబంధించి పొందిన సమ్మతి వంటి అంశాలపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయని కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నుంచి సమగ్ర నివేదికను కోరింది. రోగికి సంబంధించిన వైద్య రికార్డులు, సూచించిన, నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు, రోగి/కుటుంబ సభ్యుల నుంచి పొందిన సమ్మతి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన విచారణ వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. ఈ నివేదికపై నవంబర్ 6న విచారణ జరపనుంది



# నగరంలో రేపటినుంచి సారస్ మేలా

- **పది రోజులపాటు పల్లె ఉత్పత్తుల పండుగ**
- **20 రాష్ట్రాల నుంచి 200 పైగా స్టాళ్లు**
- **11న బతుకమ్మ వేడుకలు, హాజరు కానున్న మంత్రి సీతక్క**

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 6 :**

నగర వాసులకు గ్రామీణ భారతీయ కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఒకే వేదికపై ఆస్వాదించే అవకాశం రానుంది. ఈనెల 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచఎండీఏ గ్రౌండ్స్‌లో సారస్ మేలా జరగనుంది. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ఈ మేళాను నిర్వహిస్తోంది. 20 రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ వేదికగా సారస్ నిలవనుంది. ఈసారి 200కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణకు చెందినవే 95 కాగా, ఇతర రాష్ట్రాలకు చెందినవి 100కు పైగా ఉన్నాయి. ఇవేకాక వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో 43 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి.

**ఒకేచోట తెలంగాణ చేనేతల అందం.. దేశీ రుచుల వైవిధ్యం**

మేళాలో అడుగుపెడితే తెలంగాణ పల్లెల సృజనాత్మకత నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతల వరకు ఒకే ప్రాంగణంలో కనిపించనున్నాయి. ఒక వైపు పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతల అందం.. మరోవైపు గ్రామీణ మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు.. ఇంకోవైపు పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. రాష్ట్రం నుంచి 32 హస్తకళల స్టాళ్లు, 20 చేనేత స్టాళ్లు, 30 ఆహార ఉత్పత్తుల స్టాళ్లు, 4 హెర్బల్ ఉత్పత్తుల స్టాళ్లు, 3 ప్రొడక్షన్ ఐటమ్స్, 6 లైవ్ ఫుడ్ స్టాళ్లు కలిపి మొత్తం 95 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. చెక్క బొమ్మలు, జూట్ బ్యాగులు, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, బంజారా కళాకృతులు, ఎంబ్రాయిడరీ, వివిధ ఆర్ట్ వర్క్స్‌తోపాటు పచ్చళ్లు, పొడులు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

**22 రాష్ట్రాల గ్రామీణ ప్రతిభ**

రాష్ట్రంతోపాటు దేశంలోని 21 ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులతో పాల్గొంటున్నాయి. ఏపీ నుంచి 15 స్టాళ్లు, అండమాన్ నికోబార్ నుంచి 1, అసోం 1, బీహార్ 3, ఛత్తీస్‌గఢ్ 3, గోవా 2, గుజరాత్ 4, హిమాచల్‌ప్రదేశ్ 1, జమ్మూ కశ్మీర్ 1, కర్ణాటక 5, కేరళ 7, మధ్యప్రదేశ్ 1, మహారాష్ట్ర 6, మణిపూర్ 2, ఒడిశా 5, రాజస్థాన్ 7, సిక్కిం 1, తమిళనాడు 6, త్రిపుర 2, ఉత్తరప్రదేశ్ 2, ఉత్తరాఖండ్ 1, పశ్చిమబెంగాల్ 5 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. ఏర్పాటు చేస్తున్నారు. ఇక తెలంగాణతో పాటు ఇతర సంస్థల ఉత్పత్తులకు కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. ఏఎలఈఏపీ ఆధ్వర్యంలో 4, మెప్మా 15, నాబార్డ్ 10, టీజీ హెచ్‌డీసీ (గోల్కొండ) 2, టీజీఎస్‌సీఓ 1, ట్రైఫెడ్ 2, విజయ డెయిరీ 1, వీ హబ్ 8 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

**పల్లె ఉత్పత్తికి పట్టణ మార్కెట్**

సారస్ మేళా గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణ వినియోగదారుల ముందుకు తీసుకెళ్లే మార్కెట్ అనుసంధాన వేదిక. తమ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి ఎలాంటి స్పందన వస్తున్నదో మహిళా పారిశ్రామికవేత్తలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.



## భూకంపంతో ఉత్తరాఖండ్‌లో వణికిన భూమి

- రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదు
- రాత్రి 10:30 గంటల సమయంలో ప్రకంపనలు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాలకు వ్యాపించిన ప్రభావం
- ప్రాణ, ఆస్తి నష్టంపై ఇప్పటివరకు సమాచారం లేదు

**డెహ్రాడూన్, అక్టోబర్ 6:**

ఉత్తరాఖండ్‌లో మంగళవారం రాత్రి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదైనట్లు సీస్మోలాజికల్ అధికారులు తెలిపారు. రాత్రి 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఖాదున్ లగా గవాలి ప్రాంతానికి సుమారు 22 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ప్రకంపనలు సంభవించిన సమయంలో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బహుళ అంతస్తుల భవనాలతో పాటు ఇళ్లలోని ఫ్యాన్లు, ఇతర వస్తువులు ఊగడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది.

**ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ ప్రకంపనలు**

భూకంప ప్రభావం ఉత్తరాఖండ్‌కే పరిమితం కాలేదు. ఢిల్లీఎన్‌సీఆర్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం లోతుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

**నష్టంపై కొనసాగుతున్న ఆరా**

భూకంపం కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. ప్రకంపనలకు సంబంధించిన మరిన్ని వివరాలను సీస్మోలాజికల్ విభాగాలు సేకరిస్తున్నాయి. పరిస్థితిని స్థానిక అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఆశుతోష్ దీక్షిత్

- భారత వైమానిక దళానికి 29వ అధిపతిగా నియామకం
- అక్టోబర్ 31న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నుంచి బాధ్యతల స్వీకరణ
- ప్రస్తుతం వైస్ చీఫ్‌గా.. దాదాపు నాలుగు దశాబ్దాల సేవా అనుభవం
- 3,500 గంటలకు పైగా ఫైటర్ విమానాలపై ఫ్లయింగ్ అనుభవం
- ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సిందూర్‌లో కీలక అనుభవం
- పరమ విశిష్ట సేవా మెడల్ సహా పలు పురస్కారాలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**

భారత వైమానిక దళం కొత్త అధిపతిగా ప్రస్తుత వైస్ చీఫ్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఆయన వైమానిక దళానికి 29వ అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అదే రోజు మధ్యాహ్నం దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు.

1986 డిసెంబర్ 6న ఫైటర్ స్ట్రీమ్‌లో చేరిన దీక్షిత్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. మిరాజ్ 2000, మిగ్ సిరీస్, జాగ్వార్, తేజస్ సహా వివిధ విమానాలపై 3,500 గంటలకు పైగా ఫ్లయింగ్ అనుభవం ఆయనకు ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సిందూర్ వంటి కీలక ఆపరేషన్లలోనూ పనిచేశారు.

మిరాజ్ 2000 స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్‌తో పాటు పలు ఫైటర్ ఎయిర్‌బేస్‌లు, కమాండ్లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్‌గా, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా పనిచేసిన ఆయన 2026 జూలై 1న వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎన్‌డీఏ పూర్వ విద్యార్థి అయిన దీక్షిత్ నేషనల్ డిఫెన్స్ కాలేజీలోనూ శిక్షణ పొందారు. ఆయన సేవలకు గుర్తింపుగా వాయుసేన మెడల్, విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్‌తో పాటు 2026లో పరమ విశిష్ట సేవా మెడల్ లభించింది.

## సేవాభావమే అసలైన సంపద

**హైదరాబాద్, అక్టోబర్ 6 :**

ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం ఒక పదవి కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రూప్ 1 ద్వారా నియమితులై శిక్షణ పొందిన అనంతరం వివిధ జిల్లాలకు నూతనంగా నియమితులైన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్లు డి.మౌనికారాణి (నల్గొండ), సయ్యద్ యూసఫ్ ఆలీ(ఎంవి అండ్ ఎనల్గొండ), షగుఫ్తా ఫిర్‌దౌస్( వరంగల్) డి.సందీప్ కుమార్(సంగారెడ్డి), బొంగు మాధవ్( హైదరాబాద్ సౌత్), పి.దీపక్ (మహబూబ్‌నగర్) మంగళవారం నాడు సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ నేరుగా ప్రజల ఆస్తులు, భూములు, ఆర్థిక వ్యవహారాలతో ముడిపడి ఉన్నందున అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పని తీరుతోనే మీకు మంచి పేరు వస్తుంది.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవా దృక్పథంతో పనిచేయండి.. మీ కెరీర్‌లో డబ్బు ఒక్కటే ప్రధానం కాదు.. మీపై ప్రజలకు ఉండే నమ్మకం, మీ క్రెడిబిలిటీనే మీకు అసలైన సంపద అని మంత్రి వారికి సూచించారు. నిజాయతీగా, పారదర్శకంగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, నిబంధనల పరిధిలో వేగంగా పరిష్కారాలు చూపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గౌరవంగా, సహాయకారిగా వ్యవహరించాలన్నారు.



# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ 'ఇండి' కూటమి నిరసన

- నీతి ఆయోగ్ సమీపంలో అడ్డుకున్న పోలీసులు
- పలువురు నేతల నిర్బంధం
- ఆకాశవాణి భవన్‌లో రాహుల్, ప్రియాంక బైఠాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 'ఇండి' కూటమి ఎంపీలు మంగళవారం చేపట్టిన మార్చ్ ఉద్రిక్తతకు దారితీసింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్‌కు బయలుదేరిన ఎంపీలను నీతి ఆయోగ్‌ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ప్రతిపక్ష నేతలు రోడ్డుపైనే బైఠాయించారు. పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి వెళ్లి నిరసన కొనసాగించారు. వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఎన్నికల కమిషన్ పనితీరుపై అభ్యంతరాల నేపథ్యంలో ఇండియా కూటమి ఈ మార్‌చ్‌కు పిలుపునిచ్చింది. ఉదయం సుమారు 11 గంటలకు పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎంపీలు బయలుదేరారు. పార్లమెంట్, నిర్వాచన్ సదన్ పరిసరాల్లో ముందుగానే భారీగా భద్రతా బలగాలను మోహరించి, మార్గమధ్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, వోటు హక్కును పరిరక్షించాలని కోరుతూ ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఎన్సీపీశరద్ పవార్ వర్గం ఎంపీ సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి.పోలీసులు మార్‌చ్‌ను నిలిపివేయడంతో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ బారికేడ్లపైకి ఎక్కారు. ప్రియాంక గాంధీని పోలీసులు బస్సులోకి తీసుకెళ్లగా కొద్దిసేపటికి ఆమె కిందికి దిగి రాహుల్‌తో కలిశారు. అనంతరం రాహుల్, ప్రియాంక, దీపేందర్ హుడా ఆకాశవాణి భవన్ రిసెప్షన్ గేటు ద్వారా ప్రాంగణంలోకి ప్రవేశించారు. అక్కడ చెట్టు కింద కూర్చొని, ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని పోలీసులు కోరినా వారు నిరసన కొనసాగించారు.మరోవైపు అఖిలేశ్ యాదవ్, అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ తదితరులను పోలీసులు బస్సుల్లో తరలించారు. రాహుల్‌తోపాటు కొందరు ఎంపీలను కొద్దిసేపు నిర్బంధించి విడుదల చేసారు.ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. వోట్ల అక్రమాలకు బాధ్యులైనవారు జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమతో 300 మంది ఎంపీలు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళనపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తూ దేశంలో అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని పార్టీ ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. ఎన్నికల పరాజయాలపై అసంతృప్తితో ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య సంస్థలను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. వోటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రతిపక్షాలు ప్రకటించాయి. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం 8 వరకు జిల్లాస్థాయి పాదయాత్రలు, 10 నుంచి 20 వరకు బ్లాక్ స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 25 నుంచి నవంబర్ 25 వరకు సభలు చేపట్టనున్నారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అభ్యంతరాలను వివరించేందుకు అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు సమయం కోరనున్నట్లు కూటమి తెలిపింది.

# సర్‌పై పిటిషన్లకు సుప్రీంకోర్టులో కీలక విచారణ

- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిల్‌పై ఈనెల 27న విచారణ
- ఈసీ నిర్ణయాలన్నింటినీ పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు
- • ట్ట విరుద్ధమైతే నిర్ణయాలను కొట్టివేస్తామని స్పష్టీకరణ
- * ఫారమ్-6లో మార్పులు ఎవరు చేశారో పరిశీలిస్తామన్న ధర్మాసనం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**



ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్న వేళ.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై అక్టోబర్ 27న విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, సీఈసీకి ఇప్పటికే నోటీసులు జారీ చేసింది.

**ఈసీ నిర్ణయాలపై సమీక్ష**

ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ఈసీ పలు నిర్ణయాలు తీసుకుందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏ నిర్ణయం చట్టానికి విరుద్ధంగా ఉన్నట్లు తేలినా దానిని కొట్టివేస్తామని పేర్కొంది.

**ఫారమ్-6పై స్పష్టత కోరిన ధర్మాసనం**

సర్‌లో ఉపయోగిస్తున్న ఫారమ్ 6లో మార్పులు చేశారన్న అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. అయితే ఫారమ్ 6లో ఒక్క కామా, ఫుల్‌స్టాప్ కూడా మార్చలేదని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. సర్ ఫారమ్ 6కు అదనంగా ఒక డిక్లరేషన్ మాత్రమే జత చేసినట్లు తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు.. ఫారమ్ 6లో మార్పులు ఎవరు చేశారనే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది. తాము ఫారమ్ 6లో ఎలాంటి మార్పులను ఆమోదించలేదని స్పష్టం చేసింది.

**సీఈసీపై చర్యలకు పిటిషనర్ల డిమాండ్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తదుపరి నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకోవడంతో పాటు ఆయనను సస్పెండ్ చేయాలని పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వులు కోరారు. దీనిపై ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని సస్పెండ్ చేస్తే దేశంలో ఎన్నికలను ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించింది.

# అఫ్జల్ గురు కుటుంబం అక్రమ నిర్మాణం కూల్చివేత

- బారాముల్లాలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్డు ధ్వంసం
- బుల్డోజర్లతో నిర్మాణాన్ని తొలగించిన అధికారులు
- నిబంధనలు ఉల్లంఘించినందుకే చర్యలు తీసుకున్నట్లు వెల్లడి
- 2001 పార్లమెంట్ దాడి కేసులో దోషిగా తేలిన అఫ్జల్ గురు

**శ్రీనగర్, అక్టోబర్ 6:**

పార్లమెంట్‌పై దాడి కేసులో దోషిగా తేలిన ఉగ్రవాది మహ్మద్ అఫ్జల్ గురు కుటుంబానికి చెందిన నిర్మాణాన్ని జమ్మూ కశ్మీర్ అధికారులు మంగళవారం బుల్డోజర్లతో కూల్చేశారు. బారాముల్లా జిల్లాలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్డును తొలగించినట్లు అధికారులు తెలిపారు. సోపోర్ ప్రాంతంలోని వరద ప్రభావిత భూమిలో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

**ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం**

అఫ్జల్ గురు కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డును నిర్మించి అందులో నివాసం ఉంటున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి నిర్మాణాన్ని కూల్చివేశారు.

**2013లో అఫ్జల్ గురుకు ఉరిశిక్ష**



2001లో జరిగిన పార్లమెంట్ దాడి కేసులో అఫ్జల్ గురు దోషిగా తేలాడు. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో అతడికి సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సుప్రీంకోర్టు అతడికి ఉరిశిక్షను ఖరారు చేయగా.. 2013లో శిక్ష అమలు చేశారు.

# ఢిల్లీ పోలీసుల అదుపులో రాహుల్, పలువురు ప్రతిపక్ష నాయకులు

- అరెస్టును ఖండించిన సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 :**

సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు నుండి భారత ఎన్నికల సంఘం(సీఈసీ) ప్రధాన కార్యాలయం వైపు మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అయితే భారీ ప్రదర్శనకు అనుమతి లేకపోవడం, శాంతిభద్రతల సమస్యలను కారణంగా చూపుతూ ఢిల్లీ పోలీసులు ఆకాశవాణి భవన్ సమీపంలో ప్రదర్శనను అడ్డుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉద్యమం ఒక సాధారణ రాజకీయ పోరాటం కాదని, రాజ్యాంగాన్ని కాపాడటానికి, పారదర్శక ఓటింగ్ హక్కులను నిర్ధారించడానికి చేస్తున్న పోరాటమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**రాహుల్ పోరాటానికి వణుకుతున్న కేంద్ర ప్రభుత్వం : సీఎం రేవంత్ రెడ్డి**

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అస్తవ్యస్తంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ రద్దు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పార్టీ విశ్రమించబోదని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన 'సర' రద్దు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటు బచావో.. దేశ్ బచావో(ఓటును రక్షిద్దాం..దేశాన్ని రక్షిద్దాం) ఉద్యమంలో భాగంగా అహింసాయుతంగా ఆందోళన చేస్తున్నరాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్, ఇండి కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య, చట్ట విరుద్ధమైన ఈ అరెస్టులు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనూ స్వల్ప కారణాలకే మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి నేతలను నాటి వలస ప్రభుత్వం అరెస్టు చేసేదని, ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ(బీజేపీ) కూడా అలానే రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని సీఎం విమర్శించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని సీఎం అన్నారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును రక్షించుకునేందుకు ప్రజలు, యువత రాహుల్ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని హెచ్చరించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు, లాఠీచార్జీలు కాంగ్రెస్, ఇండి కూటమి చేస్తున్న ఉద్యమాన్ని అణచివేయలేవని, తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తాయని సీఎం తెలిపారు.



**అరెస్టులు అప్రజాస్వామికం : మంత్రి పొంగులేటి**

ఓట్ల చోరీ, ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్‌ల అరెస్టులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. అరెస్టులు, లాఠీచార్జిలు, కేసులతో ఓట్ల చోరీపై కాంగ్రెస్ పోరాటాన్ని అణచలేరని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పిదాలకు బాధ్యత వహించి రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదన్నారు.

# నశాముక్త మెదక్ కోసం ఉద్యమం






- ఇంటి నుంచే మార్పు మొదలు కావాలి..
- ప్రజలంతా భాగస్వాములు కావాలి.
- 2029 నాటికి నషాముక్త తెలంగాణే లక్ష్యం.
- రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా.

**మెదక్ అక్టోబర్,06(సిరి న్యూస్)**

నషాకు దూరంగా ఉండటం ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. 'జీవితానికి అవును.. నషాకు నో' అన్న నినాదంతో నశా ముక్త మెదక్ కోసం ప్రజలంతా కలిసికట్టుగా కదలాలని పిలుపునిచ్చారు. ఇంటి నుంచే నశా ముక్తి ఉద్యమం ప్రారంభమై పాఠశాల, గ్రామం, మండలం, జిల్లా స్థాయికి విస్తరించాలని సూచించారు.మెదక్ ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన నశాముక్త భారత్ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. నశాముక్తి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.దేశాన్ని నశాముక్తంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నశాముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసైతే దేశాభివృద్ధికి తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.

**ప్రతి పాఠశాలలో ప్రతిజ్ఞ**

విద్యార్థులు మత్తు పదార్థాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తిస్తే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వెంటనే స్పందించాలని గవర్నర్ సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో నశాముక్తి ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి నెలా కనీసం ఒక పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.హైదరాబాద్‌లో జూన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, సుమారు 15 వేల మంది విద్యార్థులతో నశాముక్తి ప్రతిజ్ఞ చేయించిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు. ఆ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలకు తీసుకెళ్లాలని కోరారు.

**టీబీ నిర్మూలనపైనా దృష్టి**

నశాముక్త భారత్‌తోపాటు టీబీ ముక్త భారత్ లక్ష్య సాధనకు ప్రజలంతా సహకరించాలని గవర్నర్ అన్నారు. టీబీ పూర్తిగా నయం చేయగల వ్యాధేనని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు లభిస్తున్నాయని తెలిపారు. మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే వ్యాధి నుంచి కోలుకోవచ్చన్నారు. నశాముక్త మెదక్.. టీబీ ముక్త మెదక్.. ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



**తెలంగాణ పోలీసులకు అభినందనలు**

డ్రగ్స్ నిర్మూలనతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే తొలి ట్రోఫీ సాధించడం అభినందనీయమని గవర్నర్ అన్నారు. పోలీసులకు అభినందనలు తెలిపారు. నషాకు సంబంధించిన కార్యకలాపాలు ఎక్కడ కనిపించినా పోలీసులు, పౌర పరిపాలన సమన్వయంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాయకత్వంలో నశాముక్తి సంకల్పాన్ని మెదక్ జిల్లా ప్రజా సంకల్పంగా మార్చాలని అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రూపొందించే కార్యాచరణకు అనుగుణంగా అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

**మీడియా సహకరించాలి**

అనంతరం ఐడీఓసీ వద్ద మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. 2029 నాటికి తెలంగాణను మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిలో నషాపై చైతన్యం కల్పించేందుకు మీడియా విస్తృతంగా సహకరించాలని కోరారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేందుకు విచ్ఛిన్నకర శక్తులు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి తొలిదశలోనే వారిని నషాకు దూరం చేయాలని సూచించారు.

**గవర్నర్‌కు ఘన స్వాగతం**

నశాముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఐడీఓసీకి చేరుకున్న గవర్నర్‌కు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో రమాదేవి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. నశాముక్త్ భారత్ సెల్ఫీ పాయింట్ వద్ద గవర్నర్, మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు సెల్ఫీ దిగారు. అనంతరం మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ నషాముక్త్ మెదక్, నషాముక్త్ తెలంగాణ సాధనకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్, కలెక్టర్ ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్ నాగేష్,ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆర్డీవో రమాదేవి, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు, జిల్లా అధికారులు తదితరులు,తదితరులు పాల్గొన్నారు.

# గుంతల బాట... పాలకుల పాపాల మూట





**ఝరాసంగం, అక్టోబర్ 06 (సిరి న్యూస్):**

జహీరాబాద్ నుండి ఝరాసంగం, నారాయణఖేడ్ మీదుగా నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం టన్నుల కొద్దీ బరువుతో వెళ్లే భారీ లారీల వల్ల ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ముఖ్యంగా ప్రధాన మలుపుల్లో (టర్నింగ్‌లలో) పెద్ద పెద్ద గుంతలు పడటంతో, వాటిని తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి నిత్యం ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. కేవలం ఈ ప్రధాన రహదారే కాకుండా, ఝరాసంగం మండల కేంద్రం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారులన్నీ పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. పాలకులు అసలు పట్టించుకోకపోవడం, అధికారులు కూడా తీవ్ర నిద్రమత్తులో ఉండటంతో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ప్రజలు గుంతల బాటలోనే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దర్శనానికి వచ్చే ఇతర రాష్ట్రాల భక్తులు, నిత్యం ప్రయాణించే గ్రామీణ ప్రజలు ఈ రోడ్ల దుమ్ము, ధూళి వల్ల తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి వెంటనే గుంతలను పూడ్చి, ప్రమాదకర మలుపులను విస్తరించి, అన్ని గ్రామాల రహదారులకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గూగుల్‌లో నకిలీ కస్టమర్ కేర్ క్రెడిట్ కార్డులు ఖాళీ

- చందనగర్‌లో సైబర్ మోసం.. పది లావాదేవీల్లో రూ.2.02 లక్షలు స్వాహా

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 6 (సిరి న్యూస్):**

కస్టమర్ కేర్ నంబర్ అంటూ నమ్మించి ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2.02 లక్షలు కాజేసిన ఘటన చందనగర్‌లో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. చందనగర్ కైలాష్‌నగర్‌కు చెందిన మద్దుకూరి సుబ్రహ్మణ్యం (40) అక్టోబర్ 2న సాయంత్రం 'టీ వాలెట్' యాప్‌లో తన వివరాలను ధ్రువీకరించుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో గూగుల్‌లో వెతకగా కస్టమర్ కేర్ నంబర్‌గా కనిపించిన 9155211694కు ఫోన్ చేశాడు. అవతలి వ్యక్తి తనను కస్టమర్ కేర్ సిబ్బందిగా పరిచయం చేసుకుని పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలు సేకరించడంతో పాటు ధ్రువీకరణ ప్రక్రియ కోసం 'సీఎస్ యాప్'ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయాలని సూచించాడు. కొద్దిసేపటికే సుబ్రహ్మణ్యం వినియోగిస్తున్న యాక్సిస్ బ్యాంక్, ఆర్‌బీ843 బ్యాంక్ క్రెడిట్ కార్డుల నుంచి నగదు బదిలీ అయినట్లు సందేశాలు రావడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే రెండు క్రెడిట్ కార్డులను బ్లాక్ చేయించగా, అప్పటికే పది లావాదేవీల ద్వారా మొత్తం రూ.2,00,215.82లు ఖాతా నుంచి మాయమయ్యాయి. ఘటనపై బాధితుడు సైబర్ నేర విభాగానికి ఫిర్యాదు చేయడంతో పాటు చందనగర్ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ ఫిర్యాదు నంబర్ 33710260051993 ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి, మోసానికి ఉపయోగించిన ఫోన్ నంబర్, లావాదేవీల వివరాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# డ్యూటీకి వెళ్లిన ఉద్యోగి అదృశ్యం!



- ఆచూకీ కోసం చందానగర్ పోలీసుల గాలింపు

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 6 (సిరి న్యూస్) :**

విధులకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ప్రైవేట్ ఉద్యోగి కనిపించకుండా పోయిన ఘటన చందనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. చేవెళ్ల మండలం నవలయపల్లి గ్రామానికి చెందిన దేవులపల్లి రామకృష్ణారెడ్డి (34) గత కొంతకాలంగా చందనగర్ పద్మాజ్ కాలనీలో నివాసం ఉంటూ పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సెప్టెంబర్ 28న ఉదయం 8 గంటల సమయంలో విధులకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆ రోజు కార్యాలయంలోనూ విధులకు హాజరుకాలేదని కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. దీంతో బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీస్తూ పలు ప్రాంతాల్లో గాలించినా ఎలాంటి సమాచారం లభించలేదు. రామకృష్ణారెడ్డి ఉపయోగించే ఫోన్ నంబర్లకు కాల్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అక్టోబర్ 6న తండ్రి విష్ణువర్ధన్‌రెడ్డి చందనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. రామకృష్ణారెడ్డి సుమారు 5.4 అడుగుల ఎత్తు, తెల్లని వర్ణం, గుండ్రని ముఖంతో ఉంటాడని, చివరిసారిగా తెల్లటి షర్టు, నీలిరంగు జీన్స్ ధరించి ఉన్నాడని కు టుంబ సభ్యులు పోలీసులకు వివరించారు.

# వన దుర్గామాతను దర్శించుకున్న గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం

**పాపన్నపేట్ అక్టోబర్ 6 సిరి న్యూస్ :**



ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని మంగళవారం గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథానికి ఆలయ ఈఓ మఠం వీరేశం, దేవస్థానం సిబ్బంది, ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఏడుపాయల వన దుర్గామాత ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాశస్త్యం, పూజా కార్యక్రమాల వివరాలను గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథానికి వివరించారు. అనంతరం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించి, అమ్మవారిని దర్శించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రామచందర్ రాజు, ఏపీఆర్ఓ బాబు రావు, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన:

**కొల్చారం అక్టోబర్r 07 ( సిరి న్యూస్)**

కొల్చారం గ్రామపంచాయతీ పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా గ్రామ పరిసరాల్లో వన్యప్రాణులు కనిపించినప్పుడు వాటిని ఇబ్బంది పెట్టకుండా, సురక్షితంగా సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణతో పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని అధికారులు వివరించారు కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పృథ్వీరాజ్, సెక్షన్ ఆఫీసర్లు మల్లేశం, ఓంప్రకాశ్, కొల్చారం బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి, వరిగుంతం బీట్ ఆఫీసర్లు గబ్బర్ సింగ్, శోభారాణి పాల్గొన్నారు.




# రేణుకా మాతా చల్లంగా చూడు

- తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి
- పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్

**కొల్చారం అక్టోబర్ 06 (సిరి న్యూస్)**



ఆదిశక్తి పరాశక్తి రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటే అన్ని శుభాలే కలుగుతాయని పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్ దంపతులు అన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ 5 వ వార్షికోత్సవము అనంతరం మొదటి మంగళవారం నాడు కొల్చారం గ్రామానికి చెందిన పాలట జయశ్రీ దుర్గ ప్రసాద్ గౌడ్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక, అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజగౌడ్, రామకృష్ణ గౌడ్,అశోక్ గౌడ్, రామాగౌడ్,కృష్ణ గౌడ్ (కిట్టు) చౌరిగారి చిన్న రాములు,ఆర్కేల నాగరాజు , సంజీవ్ రావు,రాజి రెడ్డి,సుధాకర్ గౌడ్, పాండ్ర శ్రీనివాస్, సుదర్శన్,పాపగౌడ్,శివ కుమార్ గౌడ్, నారాయణగౌడ్, సత్యనారాయణ,కుమ్మరి నాగరాజు, మ్యాదరి సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్‌ను యజమానికి చేర్చిన మియాపూర్ పోలీసులు




**శేరిలింగంపల్లి,అక్టోబర్ 6 (సిరి న్యూస్):**

విధి నిర్వహణలో నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై లభించిన విలువైన ఐఫోన్‌ను అసలైన యజమానికి అప్పగించారు. దీప్తిశ్రీనగర్‌కు చెందిన శీనయ్య పిల్లలను పాఠశాలలో దింపేందుకు వెళ్తున్న సమయంలో ఫోన్‌ను పోగొట్టుకోగా, విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ అబేల్‌కు అది లభించింది. ఫోన్‌లోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని యజమాని వివరాలను గుర్తించిన పోలీసులు ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి సమక్షంలో ఐఫోన్‌ను శీనయ్యకు అందజేశారు. పోయిందనుకున్న ఫోన్ తిరిగి లభించడంతో శీనయ్య ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల నిజాయితీ, బాధ్యతాయుతమైన సేవలను స్థానికులు అభినందించారు.

# మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుభాష్ రెడ్డితో మధుసూదన్ రావు మర్యాదపూర్వక భేటీ

**జహీరాబాద్, అక్టోబర్ 5 (సిరి న్యూస్):**



సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డిని, జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా మాజీ అధ్యక్షులు ఎం. మధుసూదన్ రావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నివాసానికి వెళ్లిన మధుసూదన్ రావు ఆయనతో కొద్దిసేపు సమావేశమై పలు అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుభాష్ రెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగా జరిగినట్లు మధుసూదన్ రావు తెలిపారు.

# వీరభద్ర సౌండ్స్ అండ్ డెకరేషన్ యూనియన్ నూతన కార్యవర్గం



- **అధ్యక్షుడిగా దర్గా వీరేషం ఏకగ్రీవ ఎన్నిక**

**గుమ్మడిదల, అక్టోబర్ 6 (సిరి న్యూస్):**

వీరభద్ర సౌండ్స్ అండ్ డెకరేషన్ యూనియన్ ఉమ్మడి జిన్నారం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించగా, అధ్యక్షుడిగా దర్గా వీరేషం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ సౌండ్స్, డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. సభ్యుల ఐక్యతను పెంపొందించడంతో పాటు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన దర్గా వీరేషం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న సందర్భంగా సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సౌండ్స్, డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం అందరి సహకారంతో పనిచేస్తానని పేర్కొన్నారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేసి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# విద్యార్థులలో సేవ భావం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాం



- **ఉపాధ్యాయురాలు అర్చన**

**వెల్దుర్తి, అక్టోబర్ 06, (సిరి న్యూస్ :**

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తికి చెందిన ఉపాధ్యాయురాలు,అర్చన గైడ్ టీచర్‌గా, మహమ్మద్ ఖదీర్ పాషా స్కౌట్ మాస్టర్‌గా స్కౌట్స్ అండ్ గైడ్స్ బేసిక్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి జిల్లా విద్యాధికారి రాజు, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పొందారు. శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు. బేసిక్ ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అర్చన, మహమ్మద్ ఖదీర్ పాషాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య అభినందించారు.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై లారీలు ఢీ డ్రైవర్ దుర్మరణం

**-వట్టినాగులపల్లి వద్ద ఘోర ప్రమాదం**



శేరిలింగంపల్లి,అక్టోబర్ 6 (సిరి న్యూస్): ఔటర్ రింగ్‌రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.వట్టినాగులపల్లి సమీపంలోని 172,173వ పిల్లర్ల మధ్య ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్డారం గ్రామంలోని రోబో సిలికాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లారీ ధూళి, ఇతర నిర్మాణ సామగ్రిని లోడ్ చేసుకుని కొకాపేట్ వైపు వెళ్తుండగా, అదే మార్గంలో ముందుకు వెళ్తున్న మరో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న శివాజీ యాదవ్ కుమారుడు వినయ్‌కుమార్ యాదవ్ (41) తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల అసలు కారణాలు, వాహనాల వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం తదితర అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# అభివృద్ధి సంక్షేమం .. కాంగ్రెస్ తోనే సాధ్యం ..





- **మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**
- **కోనాపూర్ గ్రామంలో రేషన్ కార్డులో పంపిణీ.**

**రామాయంపేట, అక్టోబర్ 5 (సిరి న్యూస్)**

అభివృద్ధి సంక్షేమ కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు సోమవారం రామాయంపేట మండలంలోని కోనాపూర్‌లో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 16 రేషన్ షాపులకు మొత్తం 13,513 రేషన్ కార్డులు మంజూరు కాగా, 15 గ్రామపంచాయతీల పరిధిలోని 9,739 కార్డులను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 10 లక్షలతో కోనాపూర్‌లో నిర్మించిన మహిళా భవనాన్ని ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగాలని ఆయన సూచించారు. మహిళల సమగ్రాభివృద్ధికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో కోనాపూర్ గ్రామాన్ని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే గ్రామంలో మహిళా సంఘ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాజీలోద్దీన్ తాసిల్దార్ రజనీకుమారి మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, కోనాపూర్ గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

**ఆర్ వెంకటాపూర్లో పంచాయతీ భవనం ప్రారంభం..**

..........రామాయంపేట మండల పరిధిలోని ఆర్ వెంకటాపూర్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గ్రామ సర్పంచ్ ఉమా సంజీవరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు.

# ఫారం-7 ఓట్ల తొలగింపుపై విచారణ జరపాలి

- **అర్హులైన ఓట్లను తొలగించొద్దు..**
- **అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి: కొల్కూరి నరసింహారెడ్డి**

**పటాన్‌చెరు, అక్టోబర్ 6 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్ల నమోదుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేదలు, మధ్యతరగతి, కార్మిక కుటుంబాల ఓట్లను ఫారం 7 ద్వారా తొలగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండటం, మృతుల పేర్లపై ఓట్లు కొనసాగడం వంటి అంశాలపైనా పరిశీలన జరపాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఫారం 7 ద్వారా తొలగించిన ఓట్లపై విచారణ అనంతరం అర్హులైన వారి పేర్లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 30 శాతానికి పైగా, సుమారు 90 వేల ఓట్లు తొలగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఓట్ల అక్రమ తొలగింపు, నమోదుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతీన్, కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, జంగయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు సుబ్బయ్య, మధుసూదన్‌రెడ్డి, మహేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఆమోదం.. సమస్యలపై చర్చ

- **అభివృద్ధి పనులకు రూ.1.90 కోట్లు**
- **సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, పైప్‌లైన్ పనులకు ప్రాధాన్యం**
- **పారిశ్రామిక కాలుష్యం, రైతు భరోసాపైనా సర్వసభలో చర్చ**
- **రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావాలి**

**గుమ్మడిదల, అక్టోబర్ 6 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ సర్వసభ సమావేశంలో చర్చించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్ మరమ్మతులు, కొత్త మోటార్ల కొనుగోలు, పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సామగ్రి, చెత్త సేకరణకు సంబంధించిన పనుల కోసం రూ.1.90 కోట్ల విలువైన పనులపై సమావేశంలో చర్చించి తీర్మానించారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు వివిధ అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. ఆయా వార్డుల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటిని సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పారిశ్రామిక కాలుష్యంపై పీసీబీకి ఫిర్యాదు**

బొంతపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వాయు, జల కాలుష్యంపై ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా సర్వసభలో చర్చించారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం, దాని ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలి

- **సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం**
- **పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పించాలి**
- **తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల**

**రామాయంపేట, అక్టోబర్ 6 (సిరి న్యూస్)**






సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా పాల్గొని రామాయంపేట మెదక్ జాతీయ రహదారిపై జీడిమామిడి (Cashew Nut) మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల మాట్లాడుతూ ..పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చే జీడిమామిడి వంటి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీడిమామిడి తోటల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు దీర్ఘకాలిక ఆదాయం లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగును విస్తరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టాలని గవర్నర్ పిలుపునిచ్చారు. మొక్క నాటడం మాత్రమే కాకుండా, అవి ఎదిగే వరకు నిరంతరం సంరక్షించడం ద్వారా కార్యక్రమం లక్ష్యం సాకారం అవుతుందని అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రకృతిని అందరూ పరిరక్షించాలని, ప్రకృతి తోనే సమస్త మానవ జీవితం ఆధారపడి ఉందని, మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చిన గవర్నర్కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, కార్యదర్శి దాన కిషోర్ తో పాటు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కరవు కోరల్లోంచి దేశాన్ని గట్టెక్కించే ప్రయత్నాలేవి...?





పి.వి.రావు

**వ్యవసాయక దేశంగా ఉన్న భారత్ ను నిర్లక్ష్యం చేసి, పేదల అభ్యున్నతినే మరచి అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.ఎనిమిది దశాబ్దాలుగా రెండు ప్రధాన జాతీయ పార్టీల కూటముల దివాళా కోరు విధానాల వల్ల, ఈ దేశంలోని విద్య,వైద్య ఆరోగ్య, వ్యవసాయ రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.దేశం అభివృద్ధి చెందుతోంది ,పేదల జీవన ప్రమాణం పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం తరచూ ప్రకటించడం విడ్డూరంగా ఉంది. పేదల జీవన ప్రమాణం ఎలా పెరిగిందో వారికే తెలియాలి. దేశంలో సగట మనిషి ఒక రోజు ఆదాయం ఐదు వందల రూపాయిల లోపే ఉందన్నది అక్షర సత్యం.ఆ ఐదు వందలతోనే కుటుంబాన్ని సామన్యుడు నెట్టుకొస్తున్నాడు.**

మరి అదే పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ ఆదానీ రోజు అదాయం అక్షరాలా 210 కోట్లు ,ఇక ముఖేష్ అంబానీ రోజు ఆదాయం 163 కోట్లు. గౌతమ్ ఆదానీ గంటకు 8.78 కోట్లు సంపాదిస్తుంటే,ముఖేష్ అంబానీ 6.79 కోట్లు సంపాదిస్తున్నారు. ఈ దేశ సంపదను కొన్ని కుటుంబాలు ఇలా కొల్లగొడుతుంటే ,సామాన్యుడు చాలీ చాలని ఆదాయాంతో సతమతమవుతున్నాడు. కొందరు బడా పారిశ్రామిక వేత్తలు తీసుకున్న వందల కోట్ల అప్పులు తిరిగి చెల్లించలేమని చేతులెత్తేస్తే మారు మాట్లాడకుండా మాఫీ చేశారు. మోడీ ప్రధాని అయిన తర్వాత గడచిన పన్నెండేళ్ళలో పారిశ్రామికవేత్తల,కార్పోరేట్ సంస్థలకు అక్షరాలా 10 లక్షల కోట్ల రుణమాఫీ చేసి వారి సేవలో తరించిపోయాడు. దేశంలో అపర కుభేరులు పెరుతుంటే,పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారు.

2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తవుతాయని, అప్పటివరకు అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, 3.9 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థను అప్పటివరకు 29 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిద్దాలని లక్ష్యం గా పెట్టుకున్నట్లు మోడీ పదేపదే చెపుతున్నారు. దేశంలో ఏ వేదిక అయినా, విదేశాల్లో జరిగే ఏ సమావేశాల్లో అయినా ఇదే మాట పొల్లుపోకుండా వల్లేవేస్తున్నాడు.ఈ దేశ అత్యధిక ప్రజల ఆశలను ,ఆకాంక్షలను ఆవిరి చేసి బడా పారిశ్రామిక వేత్తల ఆదాయాలను పెంచితేనో , వారికి అపరిమిత రాయితీలు ఇస్తేనో అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందుతుందా ? దేశంలోని ప్రఖ్యాత ఆర్థిక వేత్తల సలహా, సూచనలను పెడచెవిన పెట్టి కొందరి ప్రయోజనం కోసమే ముందుకు సాగితే ఆయన అనుకున్న లక్ష్యం నెరవేరుతుందా?

సబ్కా సాథ్ , సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ అంటూ మోడీ ప్రతి బహిరంగ సభలో చెప్పుకుంటూ వస్తున్నారు. అంటే అందరి భాగస్వామ్యం, అందరి అభివృద్ధి, అందరి నమ్మకం, దేశ ప్రగతి కోసం అందరి ప్రయత్నమే వికసిత భారత్ అంటూ ఎన్డీయే ప్రభుత్వం చెబుతన్న దానికి చేతలకు పొంతన ఉండటం లేదు.

రానున్న పది, ఇరవై ఏళ్లలో దేశాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లాలన్న ఆలోచనలు ఉండటాన్ని ఎవరూ తప్పు పట్టరు, కానీ ప్రస్తుత వ్యవసాయ, పారిశ్రామిక,విద్య వైద్య రంగ సంక్షోభాల నుంచి గట్టెక్కించే ఆలోచనలు ఎక్కడ కనిపించడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసి తీరుతామని

ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 28, 2016 నాడు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన కిసాన్ ర్యాలీలో మొదటిసారిగా ప్రకటించారు.ఆయన ప్రకటన ప్రకటనగానే మిగిలిపోయింది. పైగా దేశ రైతాంగం నడ్డివిరిచేలా 2020 లో మూడు వ్యవసాయ చట్టాలను తెచ్చారు. రైతులు చేసిన వీరోచిత పోరాటాల వల్ల కేంద్రం ఆ చట్టాలను ఉపసంహరించుకుంది. కానీ వ్యవసాయరంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలు మాత్రం కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు చేతలకు ఎక్కడా పొంతన ఉండటం లేదు.

ఇక ఎల్ నినో ప్రభావంతో కరవు కోరల్లోకి గ్రామీణ భారతం వెళుతుంటే కంటి తుడుపు చర్యలే తప్ప సరైన కార్యాచరణ కన్పించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కరవు కాలంలో వలసలను నివారించి, రెక్కాడితే గాని డొక్కాడని పేదలను ఆదుకునే ఏకైక ఆధారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి కేటాయించే నిధులను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. వంద లేదా నూటా ఇరవై అయిదు రోజుల పని దినాలతో కుటుంబ పోషణ భారవుతుందని , రెండు వందల పని దినాలతో కనీసం రోజుకు ఏడు వందల రూపాయిలు గ్రామీణ పేదలకు అందాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఉపాధికి రెండు లక్షల కోట్ల ప్యాకేజీని తక్షణమే ప్రకటించాలన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం విచారకరం.దేశంలో కరవు పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.ఎల్ నినో ప్రభావంతో దేశంలో 53 శాతం భూభాగం తీవ్రమైన పొడి వాతావరణంతో కరవు పరిస్థితిని ఎదొర్కొంటుంది.ఈ ఏడాది రుతుపవనాల సీజన్ ముగిసే నాటికి దేశవ్యాప్తంగా 15 శాతం వర్షపాత లోటు స్పష్టంగా కన్పిస్తోంది.ఈ కరవుతో గ్రామీణ పేదల జీవితాలు కోలుకోలేని స్థితిలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఉపాధి హామీ నిధులు పెంచడం అట్లా ఉంచి తగ్గించారు. గత బడ్జెట్‌లతో పోలిస్తే ఉపాధి హామీ నిధులను కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. దీనివల్ల దాదాపు 15 కోట్ల మంది నమోదిత కార్మికులకు ఏడాదికి కనీసం 50 రోజుల పని కల్పించడం కూడా గగనంగా మారింది.బడ్జెట్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల కూలి బకాయిలు పేరుకుపోయాయి. కరవు సమయంలో చేతిలో డబ్బు లేక గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలస బాట పడుతున్నారు.గ్రామీణ భారత రైతాంగం సంక్షోభంలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు మాత్రం కార్పొరేట్ శక్తుల చుట్టూనే తిరుగుతున్నాయనే విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి.మరోవైపు పంటల ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభం కలిపి కనీస మద్దతు ధర కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను చట్టబద్ధం చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోంది. ఫలితంగా మార్కెట్లో దళారులు, పెద్ద కార్పొరేట్ కొనుగోలుదారులు రైతును నిలువునా దోచుకుంటున్నారు. భారతదేశం ఆర్థికంగా సూపర్ పవర్‌గా ఎదగాలంటే కార్పొరేట్ సూచీలు పెరగడం మాత్రమే కాదు, గ్రామీణ భారతంలో రైతులు ,కూలీలు సుభిక్షంగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్పొరేట్ అనుకూల విధానాల నుండి సంక్షేమ విధానాల వైపు మళ్లాల్సి ఉంది. కరవు పీడిత ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడం, ఉపాధి హామీకి నిధులు పెంచడం, మరియు రైతులకు సమగ్ర రుణ ఉపశమనం కల్పించడం ద్వారానే 'గ్రామీణ భారతాన్ని' కరవు కోరల నుండి ,ఆర్థిక సంక్షోభం నుండి రక్షించుకోగలము.

ఇక తెలంగాణలో 17 శాతం వర్షపాత లోటు నమోదైంది. 235 మండలాల్లో కరవు నెలకొందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఆలస్యంగా నైనా మేల్కొంది. తక్షణ ఉపశమన చర్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ త్వరలో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతులు యాసంగిలో తక్కువ నీటితో స్వల్ప పెట్టుబడి తో పండే స్వల్పకాలిక రకాల పంటల సాగే చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు రైతులకు పిలుపునిచ్చారు.

తెలంగాణలో నైరుతి రుతుపవనాల లోటు వల్ల భూగర్భ జలాలు క్షీణించి నీటి ఎద్దడి పెరుగుతోంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలలో 18 జిల్లాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయి. రాజధాని హైదరాబాద్‌లో కూడా 27% లోటు ఉంది.గత ఏడాది బడ్జెట్ లో వ్యసాయ రంగానికి 24,439 కోట్ల రూపాయలు కేటాయిస్తే 202627 సంవత్సరానికి 23,179 కోట్లు మాత్రమే కేటాయించారు.అత్యంత కరవు నెలకొన్న ఈ సమయంలో సుమారుగా 1260 కోట్ల రూపాయిలను తగ్గించడం రాష్ట ప్రభుత్వ అనాలోచిత చర్య. ఇక తెలంగాణాతో పాటు దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాలలో తీవ్ర కరవు నెలకొంది. పశ్చిమ భారతదేశంలో 79 శాతం ,దక్షిణ భారత్ లో 67 శాతం ప్రాంతాలు కరవు ప్రభావానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యాలు ,ప్రణాళికలు అమలు విషయంలో నిర్ణయాలను అట్లా ఉంచి కరవు కోరల్లో చిక్కుకున్న దేశాన్ని గట్టెక్కించే తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. కరవు ప్రాంతాలకు కేంద్ర బృందాలను పంపించి నష్టాలను అంచనా వేసి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలి. ఇప్పటికే చాలా రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాలలో కరవు ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించాలని కోరుతున్నాయి. దేశంలో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని పసలేని మాటలు పక్కన పెట్టి ఈ కరవు నుంచి పేద,మధ్య తరగతి ప్రజలను గట్టెక్కించే తరుణోపాయం ఆలోచించాలి.

*సీనియర్ జర్నలిస్ట్*
**9010153065**

# గ్రామాన్ని సందర్శించిన డి.ఎల్.పి.ఓ.





**వెల్దుర్తి, అక్టోబర్ 06, (సిరి న్యూస్) :**

గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగపరుస్తున్నారని సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, శేరిలా గ్రామ సర్పంచ్ పై గ్రామస్తుడు రాజు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామస్తుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తూప్రాన్ మండల డి ఎల్ పి ఓ సాయిబాబా మంగళవారం శేరిలా గ్రామాన్ని సందర్శించారు. వారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి ఇచ్చిన ఫిర్యాదుదారునీతో పాటు పాలకవర్గం సభ్యులను నిధుల దుర్వినియోగంపై నిర్ణయాలను అడిగి తెలుసుకున్నారు . డి ఎల్ పి ఓ నిధులు దుర్వినియోగం పై చేసిన ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ లోని పలు రికార్డులను వారి వెంట తీసుకెళ్లారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఫిర్యాదుదారుడు రాజు పంచాయితీలోని రికార్డులను గ్రామ సర్పంచు వద్ద నుండి తీసుకునే ప్రయత్నం చేశాడని అలాగే గ్రామ వాట్సాప్ గ్రూప్ లలో సర్పంచ్ ఉప సర్పంచ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడు అని గ్రామస్తులు, ఉప సర్పంచ్ సర్పంచ్, డి ఎల్ పి ఓ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గ్రామస్తులు ఉద్దేశించి వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ రికార్డులను తీర్మాన బుక్కులను గ్రామస్తులు బలవంతంగా చూడరాదని ఏదైనా సంబంధిత విషయం ఉంటే గ్రామ సభలోనే గ్రామస్తుల ముందర చర్చించాలని అంతేకాకుండా గ్రామపంచాయతీ సంబంధిత విషయాలను వాట్సప్ గ్రూపుల లో పురుష పదజాలం వాడరాదని అందరితో కలిసి నూతన గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలని వారు అన్నారు. గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై తదుపరి విచారణ చేసి జిల్లా కలెక్టర్ కు సంబంధిత నివేదికను అందజేస్తానని తదుపరి విచారణ వారం రోజులు చేస్తామని డిఎల్పిఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ నవీన్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,గ్రామ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణపతి లడ్డును ఐదవ సారి దక్కించుకున్న V6 రిపోర్టర్ నటరాజ్ గౌడ్



**శివంపేట్ అక్టోబర్ 6(సిరి న్యూస్ )**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని కింగ్స్ యూత్ పిఎంజి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డు ను V6 రిపోర్టర్ నటరాజ్ గౌడ్ ఐదవ సారి కైవసం చేసుకున్నారు. ప్రతి సంవత్సరం గణేశునికి ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గణపతి లడ్డును తీసుకోవడం అదృష్టమని అన్నారు. నాలుగుసార్లు గౌడ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణేశుని వద్ద లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈసారి కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లడ్డూను కైవసం చేసుకున్నారు. గణపతి లడ్డును

కైవసం చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. గణేష్ ని లడ్డును ప్రతి సంవత్సరం కైవసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు త్రినే ష్ గౌడ్, మధు,కింగ్స్ యూత్ సభ్యులు అజయ్, మల్లేష్, అంజి, శ్రీచేరాన్,భారత్, రాకేష్, మాలికార్జున్, విక్రమ్, నితిన్, మగ్దము, మగ్గం పాల్గొన్నారు.

# పోషకాహార లోపంతో మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం





- **సంగారెడ్డి డీడబ్ల్యూఓ లలితా కుమారి**
- **జోగిపేటలో 9వ జాతీయ పోషణ మాసోత్సవం**

**జోగిపేట, సెప్టెంబర్ 06, (సిరి న్యూస్):**

పోషకాహార లోపం వల్ల మహిళలు, పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల, అభ్యాసం, ఉత్పాదకతపై జీవితాంతం ప్రభావం చూపుతుందని డీడబ్ల్యూఓ లలితా కుమారి అన్నారు. జోగిపేటలో మంగళవారం 9వ పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి మధులత అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ 9వ పోషణ మాసోత్సవం అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందన్నారు.ప్రతి సెప్టెంబర్‌లో నిర్వహించే జాతీయ పోషణ మాసోత్సవం.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోరులు, వారి కుటుంబాల్లో పోషకాహారం, ఆరోగ్యం, సంరక్షణకు సంబంధించిన కీలక అలవాట్లపై అవగాహన పెంచేందుకు ప్రజలను భాగస్వాములను చేసే ప్రత్యేక వేదికయని గర్భిణులు, బాలింతలకు సమతుల, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారం అవసరంపై అవగాహన కల్పిస్తుందన్నారు. గత పోషణ మాస కార్యక్రమాల ద్వారా మాతృ పోషణ, శిశువులు, చిన్నారుల ఆహార పద్ధతులు, ఎదుగుదల పర్యవేక్షణ, పరిశుభ్రతపై అవగాహన పెరిగిందన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లలో సానుకూల మార్పు వచ్చిందన్నారు. ఈ సమస్యపై సమన్వయంతో పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం 2018 మార్చిలో పోషణ్ అభియాన్‌ను ప్రారంభించిందన్నారు. జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాతా శిశు రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పిల్లల్లో పౌష్టికాహర లోపంను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు కూడా అవసరమైన సంరక్షణ, సాయం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద శిశు సంరక్షణ వ్యవస్థగా నిలిచాయన్నారు. రాష్ట్ర స్థాయిలో అభివృద్ధి పనుల్లో పోటీ పడుతున్న నియోజకవర్గం అందోలు అని చెప్పవచ్చునని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ నేతృత్వంలో రెండు వేలకు పైగా కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే అందోలులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవనం పూర్తి కాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మధులత, మెప్మా టీఎంసీ బిక్షపతి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వకష్టహార సహకార చాకరిమెట్ల హనుమాన్ దర్శనం

**శివంపేట్ అక్టోబర్ 6 (సిరి న్యూస్ )**



శివంపేట మండలం, చిన్న గొట్టేముక్కల గ్రామపంచాయతీ పరిధిలోని గల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవాలయం చుట్టూ దట్టమైన అడవి పచ్చని చెట్లతో భక్తులను పరవశిస్తూ ఆహ్లాదానికి నిలయంగా మారింది. గజ్వేల్ సంగారెడ్డి ప్రధాన రోడ్డు పక్కన వెలిసి భక్తులకు కొంగు బంగారంగా విరజిల్లుతుంది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళ శనివారాల్లో భక్తులు వందల సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సత్యనారాయణ వ్రతాలను ఆచరిస్తున్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రోజు పూజలు జరుగుతున్నాయి. మంగళవారం రోజున శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారిని ఆలయ పూజారి ప్రభు రాజు శర్మ తన కరములొచ్చే వైభవపేత్తంగా అలంకరణ గావించి,సర్వకష్టహర సహకార హనుమాన్ దివ్య దర్శనం ను భక్తులకు కల్పించారు.

# చూపులతో గుచ్చి గుచ్చి..



**ముంబై, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** గ్లామర్ ఫొటోషూట్లతో తరచూ అభిమానుల దృష్టిని ఆకర్షించే నటి ఆయేషా ఖాన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ స్ట్రాప్ నెక్ క్యామిసోల్‌లో కనిపించిన ఆయేషా.. పెయింట్ బ్రష్‌ను నోట పట్టుకుని ఇచ్చిన ఇంటెన్స్ పోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెస్సీ బన్, ముక్కుపుడకతో సింపుల్ లుక్‌ను ఎంచుకున్న ఆమె.. గోల్డెన్ లైటింగ్ మధ్య జుట్టుతో ఆడుకుంటూ కెమెరాకు పోజిచ్చారు. సహజమైన మేకప్, స్టూడియో వాతావరణం ఫొటోలకు గ్లామర్‌తో పాటు కళాత్మకమైన టచ్‌ను తీసుకొచ్చాయి. మరో ఫొటోలో ఆయేషా పూర్తి భిన్నమైన మూడ్‌లో కనిపించారు. గ్రే ప్యాంట్ ధరించి నేలపై కూర్చుని ఫొటో బుక్‌ను తిరగేస్తూ బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్‌లో పోజిచ్చారు. ఒకవైపు బోల్డ్ లుక్.. మరోవైపు క్యాండిడ్ స్టైల్‌తో సాగిన ఈ ఫొటోషూట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆయేషా చేతిలో కొత్త సినిమా ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన లేదు. అయినప్పటికీ ఫొటోషూట్లు, సామాజిక మాధ్యమాల్లో తనదైన స్టైల్‌తో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.



# తెరపై థ్యాంక్స్ కార్డ్

## ఎమోషనల్ అయిన 'దృశ్యం 3' దర్శకుడి భార్య!

**ముంబై, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** సాధారణంగా భర్త తీసిన సినిమాను థియేటర్‌లో చూడటం ఏ భార్యకైనా సంతోషానిచ్చే విషయమే. కానీ, వెండితెరపై భర్త తనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం చూస్తే ఆ భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. సరిగ్గా అలాంటి అనుభూతినే పొంది కన్నీటి పర్యంతమయ్యారు బాలీవుడ్ నటి శివాలికా ఒబెరాయ్. తన భర్త, ప్రముఖ దర్శకుడు అభిషేక్ పాఠక్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' (దృశ్యం 3) సినిమా చూస్తుండగా ఆమె థియేటర్‌లోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సినిమా పూర్తయ్యాక ఎండ్ టైటిల్స్ పడుతున్న సమయంలో.. దర్శకుడు అభిషేక్ పాఠక్ తన భార్య శివాలికాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ తెరపై ఓ ప్రత్యేక నోట్ వేశారు. సినిమా నిర్మాణ ప్రయాణంలో, కష్ట సమయాల్లో ఆమె అందించిన నిరంతర మద్దతును అందులో గుర్తుచేసుకున్నారు. బిగ్ స్క్రీన్‌పై ఆ థ్యాంక్స్ కార్డ్‌ను చూసి ఉద్వేగానికి లోనైన శివాలికా, ఆ క్షణాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. "తెరపై ఆ నోట్ చూడగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ సినిమా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు మనం ఎన్నో త్యాగాలు చేశాం, తీవ్రమైన కష్టాలను ఎదుర్కొన్నాం. రోజుల తరబడి ఒకరికొకరం దూరంగా గడపాల్సి వచ్చింది. కానీ నీ పనితనంపై నాకు మొదటినుంచీ పూర్తి నమ్మకం ఉంది. ఈ రోజు నీ కష్టాన్ని ప్రపంచమంతా మెచ్చుకుంటుంటే ఆ శ్రమ అంతా మర్చిపోయాను. భవిష్యత్తులో మన కూతురు 'ఆరికా' కూడా ఈ సినిమా చూసి నిన్ను చూసి గర్వపడుతుంది. నీలాంటి వ్యక్తికి భార్యనైనందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని శివాలికా తన పోస్టులో భావోద్వేగంగా రాసుకొచ్చారు. కాగా, అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'దృశ్యం 3' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఏకంగా రూ.175 కోట్లు కొల్లగొట్టి, రూ.200 కోట్ల క్లబ్ దిశగా అత్యంత వేగంగా పయనిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, శ్రియ, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించగా.. అలోక్ జైన్, అజిత్ అంధారే, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా నిర్మించారు.

# 'రామాయణ' సెట్‌లో భారీ అగ్ని ప్రమాదం

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలెంటెడ్ హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తుండగా.. కన్నడ స్టార్ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నారు.ప్రస్తుతం ముంబైలోని గోరేగావ్ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో చిత్రబృందానికి ఊహించని షాక్ తగిలింది. సోమవారం మధ్యాహ్నం 4:02 గంటలకు ఫిల్మ్ సిటీలోని రిలయన్స్ మీడియా వర్క్స్, ప్రైమ్ ఫోకస్ వెనుక భాగంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు ముంబై ఫైర్ విభాగం వెల్లడించింది. ప్రైమ్ ఫోకస్ స్టూడియో వెనుక ఉన్న వంద అడుగుల తాత్కాలిక సెట్‌లోని పీసీఆర్ యూనిట్‌లో ఈ మంటలు చెలరేగాయి. ఎలక్ట్రిక్ వైరింగ్, కేబుల్స్, తలుపులు, చెక్కపలకలు, ఏసీ యూనిట్లు, బాంబులు, ప్లాస్టిక్ సామగ్రి, సౌండ్ సిస్టమ్స్, షూటింగ్ పరికరాలు ఈ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ముంబై ఫైర్ సిబ్బంది, పోలీసులు, బీఎంసీ వార్డ్ కంట్రోల్, 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 4:55 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. 'రామాయణ' సెట్టే కాకుండా, పక్కనే ఉన్న స్టూడియోలలో షూటింగ్ జరుపుకుంటున్న ఎంటీవీ 'హస్టిల్ 5', 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్లు కూడా ఈ ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. 'పతి పత్నీ ఔర్ పంగా 2' సెట్‌లో మొదలైన మంటలు క్రమంగా 'హస్టిల్ 5' సెట్ వైపు కూడా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు సెట్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.





# మూడు బ్రేకప్స్.. ఆసుపత్రి పాలయ్యా

## సుప్రీత సంచలన నిజాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 5 (ఉద్యమ కెరటం):** ప్రముఖ నటి సురేఖ వాణి కుమార్తెగా సినీ లోకానికి పరిచయమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సుప్రీత తన వ్యక్తిగత జీవితంపై సంచలన విషయాలను వెల్లడించారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ప్రేమకథలు, ఎదుర్కొన్న తీవ్ర మానసిక క్షోభ, ఆరోగ్య సమస్యల గురించి భావోద్వేగంగా పంచుకున్నారు. తన జీవితంలో ఇప్పటివరకు మూడు బ్రేకప్స్ జరిగాయని సుప్రీత తెలిపారు. చిన్నతనంలో కలిగిన మొదటి క్రష్‌ను తాను సీరియస్‌గా తీసుకోలేదని, అయితే రెండో రిలేషన్‌షిప్ మాత్రం తన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఆ బంధం తనకు ఎంతో మానసిక వేదనను (ట్రామా) మిగిల్చిందని, ఆ ప్రభావంతో ఇప్పటికీ జన సమూహాల్లోకి వెళ్లినప్పుడు భయాందోళనలు, కంగారు కలుగుతుంటాయని చెప్పారు. ఆ మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఇక మూడో రిలేషన్‌షిప్‌లో ఎదురైన చేదు అనుభవాలను వివరిస్తూ.. భాగస్వామిలోని తీవ్రమైన అనుమానం, ఈగో తట్టుకోలేకపోయానని సుప్రీత చెప్పారు. షూటింగ్ ప్రాంతాల్లో ఎవరితో మాట్లాడుతున్నావ్? ఎందుకు మాట్లాడుతున్నావ్? అంటూ వేధించేవారని, నియంత్రించే ఈ ధోరణి తన కెరీర్‌పై కూడా ప్రభావం చూపడంతో ఆ బంధం నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. వరుస బ్రేకప్స్ వల్ల తీవ్ర ఒత్తిడికి గురై బరువు గణనీయంగా 52 కిలోలకు తగ్గిపోయానని, ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సమస్యలను అధిగమించడానికి మెడిటేషన్, క్రమమైన చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.